# గిడ్డంగులు వృథా

- వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా పనులు
- నిధులు భారీగా దుర్వినియోగం
- పంటలు నిల్వ చేసుకునే వీలు లేక నష్టపోతున్న రైతులు

**పంట దిగుబడి వచ్చాక, మార్కెట్‌లో విక్రయించడానికి మధ్య గిడ్డంగులకు చాలా ప్రాధాన్యత ఉంది. గిట్టుబాటు ధర రానప్పుడు రైతులు కొంత కాలం పంట దిగుబడులను గిడ్డంగుల్లో భద్రపరుచుకుంటారు. దీని వల్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలకు ఆదాయం కూడా వస్తుంది. ఈ ఆలోచనతో గత వైసీపీ ప్రభుత్వం గిడ్డంగులు నిర్మించింది. కొన్ని చోట్ల భవనాలు పూర్తయినా.. ఇంతవరకు వినియోగంలోకి రాలేదు. లక్షల రూపాయల నాబార్డ్ నిధులు వెచ్చించి నిర్మించినా.. గిడ్డంగులు రైతులకు అందుబాటులోకి రాక నిరుపయోగంగా మిగిలిపోయాయి. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన గిడ్డంగులతో తమకు ఎలాంటి లాభం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**



మద్దూరులో నిరుపయోగంగా గిడ్డంగి

**చాగలమర్రి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** గత వైసీపీ ప్రభుత్వంలో నాబార్డ్ నిధులతో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 265 గిడ్డంగుల పనులు చేపట్టింది. 500 మెట్రిక్ టన్నులు, 1,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యాలతో ఆయా సహకార సంఘాల పరిధిలో గిడ్డంగులను నిర్మిస్తున్నట్లు ప్రకటించింది. అయితే ఈ గిడ్డంగులను క్షేత్రస్థాయిలో వినియోగానికి తీసుకొని రావడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్న విమర్శలు ఉన్నాయి.



పెద్దబోదనం రహదారిపై ఆరబెట్టుకున్న వరి ధాన్యం

### ఆళ్లగడ్డ డివిజన్ పరిధిలో ఇలా..

ఆళ్లగడ్డ మండలంలోని కోటకందుకూరు, పి. చింతకుంట గ్రామాల్లో రూ.40 లక్షలతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గిడ్డంగులు చేపట్టారు. ఓబుళంపల్లె సొసైటీ కింద ఆర్. కృష్ణాపురంలో రూ.44 లక్షలతో 500 మెట్రిక్ టన్నులు, మిట్టపల్లెలో రూ.84 లక్షలతో 1,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల గిడ్డంగులను ఏర్పాటు చేశారు. భవనాలు పూర్తయిన నిరుపయోగంగా ఉన్నాయి. చాగలమర్రి సొసైటీ పరిధిలో మద్దూరు గ్రామంలో రూ.84 లక్షలతో 1,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల గిడ్డంగిని నిర్మించారు. శిరివెళ్ల మండల పరిధిలో గోవిందపల్లెలో 2, శిరివెళ్లలో 3, జీనెపల్లెలో 1, కోటపాడులో 1 చొప్పున 500, 1,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పనులు ప్రారంభించారు. బేస్‌మెంట్‌లతోనే నిలిచి పోయాయి. యర్రగుంట్ల గ్రామంలో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో చేపట్టిన గిడ్డంగి బేస్‌మెంట్‌తోనే నిలిచి పోయింది. బోయలకుంట్ల సొసైటీ పరిధిలో చెన్నూరులో 1,000 మెట్రిక్ టన్నులు, మహదేవపురంలో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో చేపట్టిన గిడ్డంగుల పనులు పూర్తయిన రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. రుద్రవరం సొసైటీ పరిధిలో మందలూరు, ఆర్. నాగులవరం, పేరూరు గ్రామాల్లో 1,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం, ఎర్రగుడిదిన్నె, చిత్రేణిపల్లెలో 500 మెట్రిక్ టన్నుల సామార్థ్యంతో గిడ్డంగి పనులు చేపట్టారు. పెద్దకంబలూరు సొసైటీ పరిధిలోని పందిర్లపల్లెలో 500 మెట్రిక్ టన్నులతో 90 శాతం పనులు పూర్తి చేశారు. గోస్పాడు సొసైటీ పరిధిలోని తేళ్లపూరిలో 500 సామర్థ్యం గిడ్డంగిని నిర్మించారు. అధికారులకు హ్యాండవర్ చేయకపోవడంతో నిరుపయోగంగా ఉంది. దీబగుంట్ల సొసైటీ పరిధిలో జీనెపల్లె, పశులపాడు, నెహ్రూనగరం గ్రామాల్లో 1,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల గిడ్డంగులను ఏర్పాటు చేశారు. యాళ్లూరు సొసైటీ పరిధిలో జిల్లెల్ల, జీనెపల్లెలో 2 గిడ్డంగు పనులు చేపట్టారు. ఉయ్యాలవాడ మండల పరిధిలోని పెద్దయమ్మనూరు సొసైటీ పరిధిలో ఆర్. జంబులదిన్నె, సర్వాయిపల్లె, బోడెమ్మనూరు, హరివరం గ్రామాల్లో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గిడ్డంగు పనులు చేపట్టారు. బోడెమ్మనూరులో భవన పనులు ప్రారంభించలేదు. దొర్నిపాడు మండల పరిధిలోని క్రిష్టిపాడు, డబ్ల్యూ.గోవిందిన్నె, డబ్ల్యూ.కొత్తపల్లె, దొర్నిపాడులో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో 4 గిడ్డంగు పనులు చేపట్టారు. చాకరాజువేములలో 1,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మించిన గిడ్డంగి పనులు అసంపూర్తిగా నిలిచి పోయాయి. గుండుపాపల సొసైటీ పరిధిలో కొండాపురంలో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో, రూ. లక్షలు నిధులు వెచ్చించి చేపట్టిన పనులు ప్రారంభం కాలేదు. కొన్ని గిడ్డంగుల పనులు పూర్తయినా అధికారులకు అప్పగించలేదు. వీటి వల్ల నిధులు దుర్వినియోగం తప్ప రైతులకు ఆశించిన ప్రయోజనం చేకూరలేదు. కూటమి ప్రభుత్వం ఈ గిడ్డంగులు తమకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

### గిడ్డంగి అప్పగించలేదు

చాగలమర్రి మండలంలోని మద్దూరు గ్రామంలో 1,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో రూ.84 లక్షలు వెచ్చించి గిడ్డంగి నిర్మించారు. పనులు పూర్తయిన ఇంకా గిడ్డంగిని మాకు అప్పగించలేదు.

-ఉసేన్‌మియా, సీఈవో, చాగలమర్రి సొసైటీ

### పది రోజులపాటు రోడ్డు మీదే



ఏడు ఎకరాల్లో జొన్న సాగు చేశా. వచ్చిన దిగుబడిని పది రోజుల పాటు రోడ్డుపై ఆరబోశా. ధర లేకపోవడంతో తక్కువ ధరకే అమ్ముకున్నా. ధాన్యం నిల్వ చేసుకోడానికి ప్రభుత్వ గిడ్డంగులు అందుబాటులో ఉంటే ఈ దుస్థితి ఉండేది కాదు.

-ఇమామ్‌వలి, రైతు, మద్దూరు

### గిడ్డంగులు ఉంటే ఇబ్బంది ఉండదు



రెండెకరాల్లో వరి పంట సాగు చేశా. ఎకరాకు 40 బస్తాలు దిగుబడి వచ్చింది. 20 రోజులుగా రోడ్డుపైనే వరి ధాన్యం ఆరబోశా. గిట్టుబాటు ధర లేకున్నా పంటను వ్యాపారులు అడిగిన ధరకే అమ్ముకున్నా. గిడ్డంగులు ఉంటే ఈ ఇబ్బంది ఉండేది కాదు.

-నరసింహులు, రైతు, మల్లేవేముల

### అధికారులు స్వాధీనం చేసుకోవాలి



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ గిడ్డంగులు నిర్మాణాలు చాలా వరకు పూర్తయ్యాయి. అయితే బిల్లులు రాలేదని కాంట్రాక్టర్లు వాటిని అధికారులకు అప్పచెప్పలేదు. అధికారులు ఈ గిడ్డంగులను స్వాధీనం చేసుకొని రైతులకు ఉపయోగపడేలా చూడాలి.

-గుత్తి నరసింహులు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి, చాగలమర్రి

### అధికారులకు అప్పగించలేదు

కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలో గిడ్డంగులు నిర్మించిన వాటిని అధికారులకు అప్పగించలేదు. నాబార్డ్ నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. నిర్మాణాలు పూర్తయిఆ కొద్దిమేరకే బిల్లులు వచ్చాయి. మిగిలిన బిల్లులు వస్తే అసంపూర్తిగా ఉన్న గిడ్డంగుల పనులు పూర్తి చేసి అప్పగిస్తామని కాంట్రాక్టర్లు అధికారులకు చెబుతున్నట్లు సమాచారం.

### రోడ్లపైనే ధాన్యాలను ఆరబోసిన రైతులు

రైతులు సాగు చేసిన వరి, మొక్కజొన్న, మినుము, జొన్న తదిరత పంటలు గత నెల రోజులుగా కోతలు ముమ్మరం చేశారు. గిట్టుబాటు ధర లేకపోవడం, గిడ్డంగులు అందుబాటులో లేక కల్లాలు, సర్వీసు రహదారుల్లోనే పంట దిగుబడులను ఆరబోసుకున్నారు. కొన్ని చోట్ల వర్షాలకు తడిసి పోవడంతో రోడ్లపైనే రాసులు పోసి వ్యాపారులు అడిగిన ధరకే విక్రయించుకున్నారు.

## పరీక్షలు సజావుగా నిర్వహిస్తాం: డీఆర్వో

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఎలాంటి సమస్యలేకుండా సజావుగా నిర్వహిస్తామని, ఈ మేరకు అధికారులు సమన్వయంతో పని చేయాలని డీఆర్వో రామునాయక్ ఆదేశించారు. రీజనల్ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో పరీక్షలపై సమీక్షించారు. అనంతరం డీఆర్వో మాట్లాడుతూ మార్చి 17వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 458 పాఠశాలలకు చెందిన 25,542 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, అందులో 24,773 మంది విద్యార్థులు రెగ్యులర్ కాగా, 769 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. 130 పరీక్షా కేంద్రాలకు 130మంది చీఫ్ సూపరింటెండెంట్‌లను, 130మంది శాఖాధికారులు, ఐదు ఫ్లయింగ్‌స్క్వాడ్లను నియమిస్తున్నట్లు వివరించారు. ఏపీవోఎస్ఎస్ ఎస్ఎస్‌సీ పరీక్షలు మార్చి 3వతేదీ నుంచి 15వతేదీ వరకు, మార్చి 3వతేదీ నుంచి 15వతేదీ వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతున్నట్లు తెలియజేశారు. సమావేశంలో డీఈవో జనార్దన్‌రెడ్డి, డీఐఈవో సునీత, డీవైఈవోలు శంకర్‌ప్రసాద్, వెంకట్రామిరెడ్డిలతో పాటు ఎంఈవోలు పాల్గొన్నారు.



విద్యాశాఖాధికారులతో సమావేశమైన డీఆర్వో

## రేపు దామోదరం సంజీవయ్య జయంతి

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 104వ జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించాలని నిర్ణయించినట్లు సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి తులసి దేవి బుధవారం తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా జిల్లాలోని అధికారులు, ప్రజాప్రతినిధులు ఉదయం 9 గంటలకు నంద్యాల చెక్‌పోస్టు వద్ద సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జిల్లాలోని ప్రజలు, దళిత నాయకులు, విద్యార్థులు హాజరు కావాలని కోరారు. ఉదయం 9 గంటలకు కలెక్టర్ కాంప్లెక్స్‌లో దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం నంద్యాల చెక్‌పోస్టు సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# చౌకచక్యంగా తరలింపు

- అక్రమంగా రవాణా చేస్తున్న పేదల బియ్యం
- పట్టుబడితే 6ఏ కేసులతోనే సరి
- ఏడాదిలో 21 కేసులు నమోదు
- అందులో ఏడు మాత్రమే క్రిమినల్ కేసులు
- గోదాముల్లో మగ్గుతున్న పట్టుబడిన బియ్యం

**కర్నూలు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** ఆహార భద్రత కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీ బియ్యం పంపిణీ చేస్తోంది. పేదల ఆకలి తీర్చే బియ్యాన్ని అక్రమార్కులు పందికొక్కుల్లా తినేస్తున్నారు. తమ అక్రమ వ్యాపారానికి సరికొత్త పంథా ఎంచుకున్నారు. లారీలు, ట్రాక్టర్లు, ఆటోల్లో చౌక బియ్యం తరలిస్తుంటే అందరికీ అనుమానం వస్తుంది.. అధికారులు దాడులు చేస్తారు..అందుకని కొందరు వ్యక్తులను కూలీకి కుదుర్చుకుని ద్విచక్ర వాహనాలపై రహస్య ప్రాంతాలకు చేరుస్తున్నారు. అక్కడి నుంచి రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. దొరికితే దొంగలు.. లేదంటే దొరల్లా సాగిపోతున్నారు. పట్టుబడితే 6ఏ కేసులు నమోదు చేసి వదిలేస్తున్నారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్ల వల్ల ఆ కేసులు విచారణలోనే నెలలు గడిచిపోతున్నాయి. 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో పేదల బియ్యం అక్రమ రవాణాదారులపై 6ఏ కింద 21 కేసులు నమోదు చేశారు. అందులో ఏడు కేసుల్లో మాత్రమే క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఆ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

జిల్లాలో పౌర సరఫరాల (సివిల్ సప్లయ్) శాఖ పర్యవేక్షణలో 1,233 నిత్యావసర సరుకుల పంపిణీ దుకాణాలు ఉన్నాయి. 6.71 లక్షలు రేషన్ కార్డుదారులు ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత బియ్యం, రూపాయికి కిలో బియ్యం పథకాలు ద్వారా నెలకు 10-11 వేల మెట్రిక్ టన్నుల బియ్యం పేదలకు పంపిణీ చేస్తున్నారు. కుటుంబంలో ఎందరున్నా.. ఒక్కొక్కరికి ఐదు కిలోలు చొప్పున లెక్కకట్టి ఇస్తున్నారు. కనీసం మద్దతు ధరకు వరి ధాన్యం సేకరణ, మిల్లు ఆడించడం, రవాణా, గోదాముల అద్దె.. ఇలా వివిధ రూపాల్లో రూపాల్లో కిలో బియ్యానికి రూ.46 ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఈ లెక్కన ఒక్క కర్నూలు జిల్లాకే



మంత్రాలయం మండలం మాధవరం చెక్ పోస్టు వద్ద అధికారులు సీజ్ చేసిన బియ్యం లారీ (ఫైల్)

నెలకు సరాసరి రూ.45-46 కోట్ల చొప్పున ఏటా రూ.550 కోట్లకు పైగా రాయితీ బియ్యం రూపంలో ప్రభుత్వం వెచ్చిస్తోంది. పేదలకు ఆహార భద్రత కల్పించాలనే ఆశయంతో ఒక జిల్లాకే ఏడాదికి రూ.550 కోట్లకు పైగా ఖర్చు చేస్తుందంటే రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని వేల కోట్లు ఖర్చు చేస్తుందో ఇట్టే తెలుస్తోంది. ప్రభుత్వం ఉన్నతాశయంతో పంపిణీ చేస్తున్న రాయితీ బియ్యంపై అక్రమార్కులు పందికొక్కులా వాలిపోతున్నారు. రాజకీయ అండతో రాయితీ బియ్యం అక్రమంగా సరిహద్దులు దాటిస్తున్నారు. వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు అండతో బియ్యం అక్రమ రవాణా చేస్తే.. తాజాగా ఎన్డీఏ కూటమి నాయకుల అండతో సరిహద్దులు దాటిస్తున్నారు.

### 6ఏ కేసులతో సరిపుచ్చుతున్నారు

జిల్లాలో రేషన్ మాఫియా యథేచ్ఛగా సాగుతోంది. డీలర్లు, ఎండీయూ వాహనదారులు, బియ్యం అక్రమార్కులు కుమ్మక్కై పేదలకు ఇళ్లకు చేరాల్సిన బియ్యాన్ని కొనుగోలు చేసి అధిక ధరలకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో చౌక ధరల దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ చేసేవారు. దీంతో డీలర్ల వద్దనే తనిఖీలు చేసి అక్రమాలు జరిగితే చర్యలు తీసుకునేవారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఇంటి వద్దకే బియ్యం అంటూ ఎండీయూ వాహనాలను తీసుకొచ్చారు. దీంతో సివిల్ సప్లయ్ అధికారులు తనిఖీలు చేసి మమ అనిపిస్తున్నారు. పోలీసులు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకుంటే తప్పా సివిల్ సప్లయ్ అధికారుల దాడులు చేసి పట్టుకున్న సంఘటనలు తక్కువే. పట్టుబడితే 6ఏ కేసులు నమోదు చేసి మమ అనిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో రాయితీ బియ్యం అక్రమదారులపై 6ఏ కేసులు 21 నమోదు చేశారు. రూ.69.37 లక్షల విలువైన 1,516 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు.



ఆదోని ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడిన 324 బస్తాల రాయితీ బియ్యం

మిగతా 6వ పేజీలో

# వైభవంగా గిరి ప్రదక్షిణ

**శ్రీశైలం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి):** శ్రీశైల మహా క్షేత్రంలో బుధవారం పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీగిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని దేవస్థానం ఘనంగా నిర్వహించింది. సాయంత్రం స్వామి, అమ్మవార్ల మహామంగళ హారతుల అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకిలో ఊరేగింపుగా గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ గిరిప్రదక్షిణ కార్యక్రమం ఆలయ రాజగోపురం నుంచి ప్రారంభమై గంగాధర మండపం, అంకాళమ్మ ఆలయం, నంది మండపం, మల్లికార్జున సదనం, బయలు వీరభద్రస్వామి ఆలయం, అక్కడి నుంచి వలయదారి మీదుగా గణేశ్ సదనం, సారంగధర మండపం, గోశాల, మల్లమ్మ కన్నీరు, మహిషాసుర మర్దిని, రుద్రాక్ష మఠం, విభూతిమఠాల మీదుగా రుద్రవనం చేరుకొని తిరిగి నంది మండపం చేరుకోవడంతో శ్రీశైల గిరి ప్రదక్షిణ కార్యక్రమం ముగిసింది. క్షేత్రపరిధిలోని ప్రాచీన మఠాలు, ఆలయాలను భక్తులచే దర్శింపచేస్తూ భక్తులలో ఆధ్యాత్మిక భావాలను పెంపొందిస్తూ, క్షేత్రాన్ని ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దడంలో భాగంగా గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని దేవస్థానం నిర్వహిస్తుంది. ఇల కైలాసంగా ప్రసిద్ధమైన శ్రీశైల మహా క్షేత్రంలో గిరిప్రదక్షిణ చేయడం ఎంతో ఫలదాయకమని చెప్పబడుతుంది.



గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్న అధికారులు, అర్చకులు

## క్లోరినేషన్ తప్పనిసరి: కలెక్టర్



**నంద్యాల నూనెపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో తాగునీరు, పారిశుధ్యం, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ గ్రీన్ లీఫ్ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీరు, పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి సంపద సృష్టించే అంశాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటి నుంచి సేకరించిన తడి, పొడి చెత్తలను వేరు చేయడంతోపాటు తడి చెత్తతో వర్మీకంపోస్టు, పొడి చెత్తతో పేపర్ ప్లాస్టిక్ రీ సైక్లింగ్ చేసే సంపద తయారీ కేంద్రాలపై అవగాహన కల్పించాలన్నారు. మంచినీటి పైప్‌లైన్ల మరమ్మతులు, ఇతర రిపేర్లు ఉంటే 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ప్రతి మండలంలోని ఒక గ్రామాన్ని ఎంపిక చేసి కిచెన్‌గార్డ్ ప్రమోట్ చేసేందుకు గుర్తించాలన్నారు. అగ్రికల్చర్, హార్టికల్చర్, ఏపీసీఎన్ఎఫ్‌ల భాగస్వామ్యంతో కిచెన్ గార్డ్‌ల పెంపకం ముమ్మరం చేయాలన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15వ తేదీ 3వ శనివారం ప్రతి ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, స్థలాల్లో స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. స్వచ్ఛగ్రీన్ లీఫ్ రేటింగ్‌కు సంబంధించి పర్యాటక ప్రదేశాలు, హోటల్స్ అసోసియేషన్లతో సమావేశాలు నిర్వహించాలన్నారు.

# సాంకేతికతను ఉపయోగించండి

### నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సూచన

**నంద్యాల క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** మారుతున్న చట్టాలకనుగుణంగా పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు సాంకేతికతను వినియోగించాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సూచించారు. బుధవారం నంద్యాలలోని జిల్లా పోలీసు కార్యాలయం సమావేశ భవనంలో నంద్యాల పోలీసు సబ్ డివిజన్‌కు సంబంధించిన నేర సమీక్షా సమావేశం జరిగింది. పోలీసు స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులు, వాటి స్థితిగతులు, నమోదైన కేసుల్లో నిందితుల అరెస్ట్, దర్యాప్తు వివరాలు, పురోగతిపై పోలీసు అధికారులతో ఆరాతీసి కేసుల ఫైల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధితులకు న్యాయం జరిగేవిధంగా వ్యవహరించాలన్నారు. యుఐ కేసుల దర్యాప్తు వేగవంతం చేసి నిర్ణీత సమయంలో చార్జిషీట్ దాఖలు చేసి కేసులను తగ్గించాలని సూచించారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై సత్వరమే స్పందించాలని, తప్పిపోయిన బాల, బాలికల కేసుల్లో ఆధునిక సాంకేతికతను వినియోగించాలని, పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు సమాజంలో జరిగే నేరాలపై అవగాహన కల్పించాలన్నారు పోక్సో కేసుల్లో నిందితులపై నిఘా ఉంచాలని అవసరమైతే రౌడీషీట్ ఓపెన్ చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు వివరించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై ప్రత్యేకదృష్టి పెట్టి ప్రతిరోజు విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా తనిఖీలు నిర్వహించి గంజాయి, మద్యం, పీడీఎస్‌రైస్ అక్రమ రవాణా జరగకుండా నిరోధించాలని, బహిరంగ మద్యపానం, డ్రంకెన్‌డ్రైవ్, మైనర్ డ్రైవింగ్‌లపై చర్యలు తీసుకోవాలని, నెంబర్‌ప్లేట్లులేని వాహనాలపై నిఘా ఉంచి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతోపాటు ఎస్‌డీపీవో జావలి ఆల్ఫోన్స్, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)యుగంధర్‌బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



# ప్రాభవం కోల్పోతున్న బంగినపల్లి

- ఏటా తగ్గుతున్న సాగు విస్తీర్ణం
- పెరిగిన పెట్టుబడులతో రైతు కుదేలు
- నిలకడ లేని ధరలతో అతలాకుతలం

నోరూరించే బంగినపల్లి మామిడి పండ్లను సాగు చేసిన రైతులు ఉసూరుమంటున్నారు. ఈ రకం మామిడికి దేశవ్యాప్తంగా ఎంతో పేరున్నది. బంగినపల్లె, తోతాపురి, సువర్ణరేఖ తదితర రకాల మామిడిని రైతులు సాగు చేస్తున్నారు. ఇందులో బంగినపల్లె మామిడి సుప్రసిద్ధం. ఇందులో కూడా బంగినపల్లి బేనీషా అగ్రస్థానంలో ఉంటుంది. జిల్లాలో సుమారు 10వేల ఎకరాల్లో బంగినపల్లె మామిడి పంటను రైతులు సాగు చేస్తున్నారు. అయితే ఏటేటా మామిడి విస్తీర్ణం తగ్గిపోతోంది. సాగు ఖర్చులు విపరీతంగా పెరిగాయి. ఆ ప్రకారంగా మార్కెట్‌లో ధరలు లేక రైతులు దివాలా తీస్తున్నారు.

**బనగానపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో సాగయ్యే మామిడిలో 70 శాతం బంగినపల్లి రకమే. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 5.8 లక్షల హెక్టార్లలో వివిధ రకాల మామిడి సాగవుతోంది. ఆధునిక విధానాలు అవలంబిస్తూ జూన్ నుంచి డిసెంబరు వరకు మామిడిని సాగు చేస్తున్నారు. ఉష్ణ మండలపు ఈ పంట అన్ని నేలల్లో సాగవుతుంది. ఉమ్మడి జిల్లాల్లో ఒకప్పుడు ఒకప్పుడు 16 వేల హెక్టార్లకు పైగా బంగినపల్లి మామిడిని సాగు చేసేవారు. అయితే ప్రస్తుతం 12,270 ఎకరాలకు మామిడి పంట విస్తీర్ణం తగ్గిపోయింది. నంద్యాల జిల్లాలో 8,396 ఎకరాలు, కర్నూలు జిల్లాలో 3,874 ఎకరాలకు పడిపోయింది. బనగానపల్లె ప్రాంతంలో సుమారు 121 ఏళ్ల క్రితం బనగానపల్లె నవాబులు 1500 ఎకరాల్లో సాగు చేశారు. ఒకప్పుడు బనగానపల్లె ప్రాంతంలో 4వేల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మామిడి బనగానపల్లె ప్రాంతంలో ఏటేటా తగ్గి ప్రస్తుతం 225 ఎకరాలకు పడిపోయింది. బనగానపల్లె మండలంలో ప్రస్తుతం కేవలం 225 ఎకరాల్లో, బేతంచెర్ల మండలంలో 600 ఎకరాల్లో, ఓర్వకల్లులో 1111 ఎకరాల్లో, డోన్‌లో 2484 ఎకరాల్లో, ప్యాపిలిలో 805 ఎకరాల్లోను సాగు చేస్తున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం, వివిధ రకాల తెగుళ్లు మామిడికి వస్తుండడం, పంట సరిగా రాకపోవడంతో మామిడి రైతులు నష్టపోయారు. మామిడి చెట్లను కొట్టివేసి సాగుభూములుగా మార్చుకుంటున్నారు. దీనికి తోడు ఎస్సార్బీసీ, కేసీ కెనాల్ వంటి సాగునీరు రైతులకు అందుబాటులోకి రావడంతో, మార్కెట్‌లో ఆశించినంత ధరలు లేకపోవడంతో రైతులు మామిడి పంటను కొట్టివేసి మొక్కజొన్న, మినుము, సన్‌ఫ్లవర్, మిరప తదితర పంటలను సాగు చేస్తున్నారు. దీంతో మామిడి విస్తీర్ణం ఏటేటా తగ్గిపోతోంది.

## బంగినపల్లి మామిడికి దేశవ్యాప్త ప్రసిద్ధి

బంగినపల్లె మామిడికి దేశవ్యాప్తంగా పేరుంది. బనగానపల్లె మం డల పరిధిలోని యాగంటిపల్లె, పసుపల, క్రిష్టగిరి, జోలాపురం, బనగానపల్లె, ఇల్లూరుకొత్తపేట, చిన్నరాజుపాలెం తదితర గ్రామాల్లో బంగినపల్లె మామిడి పంటలను రైతులను పండిస్తున్నారు. అలాగే బేతంచెర్ల మండలంలో ఎంబాయి, రేపల్లె, వీరాయిపల్లె, ఆర్‌ఎస్‌రంగాపురం, ముస లాయిచెర్వు గ్రామాల్లో ఓర్వకల్లు, డోన్, ప్యాపిలి, బండి ఆత్మకూరు, తదితర మండలాల్లో పండిస్తారు. ప్రతి ఏటా వేసవి కాలంలో మండీల్లో పసుపు పచ్చగా నిగనిగలాడే మామిడి పండ్లు చూస్తే వెంటనే తినేయాలనిపిస్తుంది. అందునా బంగినపల్లి బేనిషాన్ మామిడి పండ్లకు మరింత గిరాకీ ఉంటుంది. ఈ ప్రాంతంలో ఎక్కువగా బంగినపల్లి బేనిషాన్‌తో పాటు మల్లుబా, దిల్ పసంద్, రెడ్డి పసంద్, నూఫ్లీ, ఊరగాయలకు పనికివచ్చే చిన్న ఆచారి, పెద్ద ఆచారి రకాలు విస్తారంగా పండుతాయి. మేనెలల్లో వీటి రుచి అపారం.



విరగగాసిన మామిడి పూత

**పెరిగిపోతున్న సాగు ఖర్చులు:** నానాటికీ మామిడి పంట సాగు చేయడానికి పెట్టుబడులు ఏటేటా పెరుగుతున్నాయి. దీంతో రైతలకు మామిడి సాగు భారంగా మారి రైతులు కుదేలయ్యారు. ఎకరాకు రైతు రూ.50వేల వరకు పెట్టుబడులకు ఖర్చవుతోంది. రసాయనిక ఎరువులు, పురుగు మందులు, కూలీలు, రవాణా తదితర ఖర్చుల ఏటా పెరుగుతున్నాయి. అయితే ఇంత కష్టపడ్డా ప్రకృతి కారణాల వల్ల పంట పండకుంటే రైతులు అప్పుల పాలవుతున్నారు. పూత దశలో రైతులు చెట్లకు రైతులు నీరు పెట్టడం, 8 నుంచి పది సార్లు పూత మందులు కొట్టడం, యాజమాన్య పద్ధతులు సరిగా పాటించకపోవడంతో పంట చేతికి రావడం లేదు. వచ్చినా అరకొరగా వస్తుండడంతో రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారు. దీనికి తోడు పంట చేతికొచ్చే సరికి ధరలు సరిగా లేకపోవడంతో మామిడి రైతులు పూర్తిగా నష్టపోతున్నారు. దళారీ వ్యాపారులు చెప్పిన ధరలకే మామిడి పండ్లను అమ్ముకోవాల్సి దుస్థితి రావడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గుతున్నారు.

**పూత నిలబెట్టుకోవడానికి నానా అవస్థలు :** మామిడి పూత నిలబెట్టుకోవడానికి మామిడి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. పూత సరిగా రాకపోవడం, వచ్చినా చీడపీడల వల్ల దెబ్బతినడంతో రైతులు నష్టపోతున్నారు. ఒక వేళ కాయ చేతికి వచ్చినా ధరలు లేక రైతులు దెబ్బతింటున్నారు. ముఖ్యంగా బనగానపల్లె, బేతంచెర్ల, డోన్, ప్యాపిలి, బండి ఆత్మకూరు, ఓర్వకల్లు, పాణ్యం మండలాల్లో ఉన్న మామిడి పంటలో లాభాలు లేకపోవడంతో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టారు. బనగానపల్లె, పాణ్యం ప్రాంతంలో ఎస్సార్బీసీ కాల్వలకు నీరు రావడంతో రైతులు మామిడి పంటలను చెరిపేసి మొక్కజొన్న, మినుము, పెసర తదితర పంటలపై దృష్టి సారించారు. ఈ మామిడి సీజన్‌లో గత నవంబరు, డిసెంబరు నెలలో కురిసిన తుఫాన్ వల్ల పూత రాలిపోయింది. తిరిగి జనవరి, ఫిబ్రవరి నెలల్లో చలిగాలులు, చల్లని వాతావరణం వల్ల పూత రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే పూత నిలబెట్టుకోవడానికి రైతులు చాలా ప్రయత్నాలు చేస్తున్నారు.

### ప్రత్యామ్నాయ పంటల వైపు రైతుల మొగ్గు



మామిడి పంటలో ఆదాయాలు రాకపోవడంతో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు ఆసక్తి చూపుతున్నారు. సాగునీటి అవకాశాలు పెరగడంతో రైతులు మామిడిచెట్లను కొట్టివేసి మొక్కజొన్న, మినుము, పెసర, మిరప తదితర పంటలు సాగు చేసుకుంటున్నారు. ముఖ్యంగా ఎస్సార్బీసీ, కేసీ కెనాల్, తెలుగుగంగ పంట కాల్వల ద్వారా సంవత్సరానికి రెండు పంటలు సాగు చేసుకొనే అవకాశం ఉండటంతో రైతులు మామిడి చెట్లను తొలగించి వేరే పంటలు సాగు చేస్తున్నారు.

-రఘువరన్, హార్టికల్చర్ అధికారి, బనగానపల్లె

## ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

**నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి):** ఉమ్మడి జిల్లాలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందడానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి తెలిపారు. అర్హులైన విద్యార్థులు మార్చి 6వ తేదీలోపు కంప్యూటర్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 1వ తేదీన హాల్ టికెట్‌లను జారీ అవుతాయని తెలిపారు. ఏప్రిల్ 6వతేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. 5వ తరగతి విద్యార్థుల కోసం జూపాడుబంగ్లా బాలుర గురుకులంలో 80, బాలికల గురుకులంలో 80, డోన్ బాలుర గురుకులంలో, కోవెలకుంట్ల బాలికల గురుకులంలో 80, ఆళ్లగడ్డ పడకండ్లలోని బాలికల గురుకులంలో 80, లక్ష్మాపురంలో బాలికల గురుకులంలో 80, ఆళ్లగడ్డ రెగ్యులర్ బాలికల గురుకులంలో 80 సీట్లు ఉన్నాయన్నారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు జూపాడుబంగ్లా బాలుర గురుకులంలో 80, డోన్ బాలుర గురుకులంలో 80, కోవెలకుంట్ల బాలికల గురుకులంలో 80, డోన్ బాలికల గురుకులంలో 80, లక్ష్మాపురం బాలికల గురుకులంలో 80, పడకండ్ల బాలికల గురుకులంలో 80, ఆళ్లగడ్డ రెగ్యులర్ బాలికల గురుకులంలో 80 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వీటిలో రిజర్వేషన్‌ల ప్రకారం ప్రతి గురుకుల పాఠశాలలో ఎస్సీలకు 60, బీసీ-సి లకు 10, ఎస్టీలకు ఐదు, బీసీలకు 4, ఓసీలకు ఒకటి చొప్పున భర్తీ చేస్తామని కోఆర్డినేటర్ శ్రీదేవి తెలిపారు.

## శ్రీశైలంలో విజిలెన్స్ తనిఖీలు

**సున్నిపెంట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి):** శ్రీశైల దేవస్థానం పరిధిలో 2021-2024 జరిగిన వివిధ అభివృద్ధి పనులపై ఫిర్యాదు మేరకు విజిలెన్సు అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. దేవస్థానం ఇంజనీరు విభాగం రూ.50 కోట్ల వ్యయంతో చేపట్టిన గణేష సదన్ భవన నిర్మాణం, గణేష సదన్ చుట్టూ నిర్మించిన సీసీ రోడ్లను పరిశీలించి నమూనాలను సేకరించారు. వీటితోపాటు నక్షత్ర వనం, రూ.5 కోట్ల అంచనా వేయంతో సరిహద్దుల ఏర్పాటు పనులపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. రెండు రోజుల పాటు విజిలెన్స్ డీఈ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించనున్నారు.



తనిఖీ చేస్తున్న అధికారులు

## బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

**మహానంది, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** మహానందిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఉత్సవాల ప్రత్యేకాధికారి రామాంజనేయులు పరిశీలించారు. బుధవారం మహానంది ఆలయ పరిసరాల్లో భక్తుల ఏర్పాట్లల్లో భాగంగా క్షేత్రంలో జరుగుతున్న పలు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లల్లో భాగంగా కొన్ని మార్పు, చేర్పులను ప్రత్యేకాధికారి దేవస్థానం ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులుకు సూచించారు. శివరాత్రి నాటికి భక్తులకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు కల్పించాలని చెప్పారు. అనంతరం దేవస్థానం ప్రధాన కార్యాలయంలో ఆలయ ఈవోతో శివరాత్రి ఏర్పాటు పనులపై చర్చించారు. ఈనెల 18వ తేదీన మహానంది శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై మహానంది దేవస్థానం కార్యాలయంలో కో ఆర్డినేషన్ సమావేశం నంద్యాల ఆర్డీట విశ్వనాథ్, ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



మహానందిలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి రామాంజనేయిలు

## నల్లమలను సందర్శించిన డిప్యూటీ డైరెక్టరు అనురాగ్ మీనా

**రుద్రవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) :** నల్లమల అటవిలో భాగంగా రుద్రవరం రేంజ్‌లో నంద్యాల ఫారెస్టు శాఖ డిప్యూటీ డైరెక్టరు అనురాగ్‌మీనా బుధవారం సందర్శించారు. రేంజ్ పరిధిలో అభివృద్ధి పనులను పరిశీలించారు. వృక్ష సంపదను పరిశీలించారు. నాగంబావి నుంచి ఉల్లెడ వరకు, బోరింగ్ రస్తా నుంచి పాములేటి నరసింహస్వామి దేవాలయం వరకు జరిగే అభివృద్ధి పనులను పరిశీలించారు. వన్యప్రాణులకు హానీ జరగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే వృక్ష సంపదను కాపాడాలన్నారు. ఆయన వెంట రేంజర్ శ్రీపతినాయుడు ఉన్నారు.

## భవన నిర్మాణ అనుమతులు ఇక సులువు

### కొత్తగా ఆంధ్రప్రదేశ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీం



**నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** భవన నిర్మాణ అనుమతులు ఇక సులువు కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీం(ఎస్‌సిఎస్) 25 పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ స్కీంలో భాగంగా 18 మీటర్లు లోపు భవన నిర్మాణ అనుమతులు లైసెన్స్ టెక్నికల్ పర్సనల్(ఆర్కిటెక్ట్/ఇంజనీర్) నుంచి పొందవచ్చు. మున్సిపల్ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన అవసరం లేదు. ఆంధ్రప్రదేశ్ అర్బన్ లోకల్ బాడీలు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు పరిధిలో జరిగే నిర్మాణాలు ఎస్‌సీఎస్ స్కీంలోకి వస్తాయి. భూమి యజమాని లేదా లీజుదారు/పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్లు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆమోదిత లేఅవుట్లలోని ప్లాట్లు, ఏఎల్‌ఆర్‌ఎస్ 2008, ఎల్‌ఆర్‌ఎస్ 2020 ద్వారా రెగ్యులైర్ చేయబడిన లేఅవుట్లు, గ్రామ కంఠం, గ్రామ సైట్లు, ఇప్పటికే అనుమతి ఉన్న భవనాల పునరుద్ధరణకు మాత్రమే ఆంధ్రప్రదేశ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీంలో దరఖాస్తు చేసుకోవాలి. సీఆర్‌జెడ్ ప్రాంతాలు, అనధికార లేఅవుట్లు, మాస్టర్ ప్లాన్ నిషిద్ధ ప్రాంతాల పేరు మీద దరఖాస్తుకు అర్హత లేదు. సెల్ఫ్ సర్టిఫికేషన్ ప్రక్రియకు లైసెన్స్ టెక్నికల్ పర్సనల్(ఆర్కిటెక్ట్/ఇంజనీర్) లు స్వీయ ధృవీకరణ పత్రంలో సంతకం చేసి ఆన్‌లైన్ బిల్డింగ్ పర్మిషన్ సిస్టమ్ (ఓబీపీఎస్)ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. స్లాబ్ ఇన్స్ట్రక్షన్ (ప్లింత్ స్థాయి) ఎల్‌టీపీ, ఓబీపీఎస్ రిపోర్టును ఏడు రోజుల్లోగా సమర్పించాలి. నిర్మాణం పూర్తైన తర్వాత ఎల్‌టీపీ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ను ఓబీఎస్‌లో సమర్పించాలి. తప్పుడు సమాచారం ఇస్తే అనుమతి రద్దు చేయటంతో పాటు ఎల్‌టీపీ 5 సంవత్సరాలు నిషేధిస్తారు. వివరాలను హెచ్‌టీపీపీఎస్//జీఓఐఆర్.ఏపీ.జీఓవీ.ఇన్‌లో పరిశీలించవచ్చు.

### లోపాలు సరిదిద్దాలి

స్కీం బాగానే ఉంది కానీ కొన్ని లోపాలు ఉన్నాయి వాటిని సరిదిద్దాలి సర్క్యులేషన్ ప్యాటరన్ అమలు పరచాలి. రెండు సెంట్ల భవన నిర్మాణంలో మున్సిపల్ అనుమతులు అవసరం లేదు అంటోంది సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీం. కాని మున్సిపల్ అధికారులు తమకు ఈ విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవని అంటున్నారు. ఇది చిన్న ఇళ్లు నిర్మించుకునే వారికి ఆటకంగా మారింది. ప్రభుత్వం ఈ సమస్యను త్వరంగా పరిష్కరించాలి. సెల్ఫ్ డిక్లరేషన్ నియమయం ఆచరణలో కష్టమే. ఎందుకంటే వివిధ కారణాల వల్ల కొన్ని చోట్ల యజమానులు ఒప్పందం మేరకు సమయానికి ఇళ్లు కట్టలేకపోవచ్చు. అప్పుడు ఇంజనీర్లకు ఇబ్బంది అవుతుంది. ఇంజనీర్ల లైసెన్స్ 5 సంవత్సరాలు రద్దును పరిశీలించాలి, ఏవరో చేసిన తప్పుకు ఇంజనీర్ లైసెన్స్ రద్దు చేయటం సబబు కాదు. ఈ ఇబ్బందులను లోపాలను సరిదిద్దగలిగితే సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీం మంచిదే.

- సుధీర్, లైసెన్స్‌డ్ ఇంజనీర్

# చౌకచక్కంగా తరలింపు..!



తుగ్గలి మండలం జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు సీజ్ చేసిన రేషన్ బియ్యం లారీ (ఫైల్)

(5వ పేజీ తరువాయి)

21 6ఏ కేసుల్లో ఏడు కేసుల్లో మాత్రమే క్రిమినల్ కేసులు నమోదు చేశారు. జేసీ కోర్టులో 6ఏ కేసులు విచారణలో అంతులేని జాప్యం అక్రమార్కులకు వరంగా మారుతోంది. రాజకీయ అండతో కేసు కొట్టేసుకోవచ్చులే అనే ధీమాతో బియ్యం సరిహద్దులు దాటిస్తున్నారు. డీలర్లు, ఎండీయూ వాహదారులపై నిఘా పెట్టాలని, అక్రమాలు వెలుగులోకి వస్తే 6ఏ కేసులతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేసి తక్షణమే అరెస్టులు చేస్తే తప్పా బియ్యం మాఫియాకు కళ్లెం వేయలేమని పలువురు పేర్కొంటున్నారు. ఆదోని, ఆలూరు, పత్తికొండ, డోన్ అడ్డాగా బియ్యం మాఫియా పెట్రేగిపోతోంది.

### గోదాముల్లో మగ్గుతున్న బియ్యం

ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక ఆరు నెలలు, అంతకు ముందు ఆరు నెలలు నుంచి అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన పేదల బియ్యం 1,516 క్వింటాళ్లు సహా వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టుబడిన 2,784 క్వింటాళ్లు కలిపి 4,300 క్వింటాళ్లు (430 టన్నులు) పేదల బియ్యం వివిధ ఎంఎల్‌ఎస్ స్టాక్ పాయింట్లలో నిల్వ ఉన్నాయి. పేదల బియ్యం కోసం ప్రభుత్వం కిలోకు రూ.46 ఖర్చు చేస్తోంది. ఈ లెక్కన గోదాముల్లో మగ్గుతున్న పట్టుబడిన బియ్యం విలువ రూ.1.96 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. బహిరంగ వేలం (పబ్లిక్ ఆక్షన్) ద్వారా పట్టుబడి బియ్యం విక్రయించి వచ్చిన ఆ డబ్బును ఖజానాలో జమ చేయాల్సిన అధికారులు ఆ దిశగా తీసుకుంటున్న శూన్యమే అనే చెప్పాలి.

**జిల్లాలో రేషన్ కార్డులు, బియ్యం కోటా వివరాలు**

| వివరాలు | కర్నూలు |
|---|---|
| రేషన్ షాపులు | 1,233 |
| ఎండీయూ వాహనాలు | 409 |
| రేషన్ కార్డుదారులు | 6,76,206 |
| బియ్యం కోటా నెలకు | 11,845 టన్నులు |

### పేదల బియ్యం అక్రమ రవాణాలో 6ఏ, క్రిమినల్ కేసులు నమోదు వివరాలు కొన్ని

- ఆదోని పట్టణంలో పేదల బియ్యం రవాణా చేస్తున్న కోసిగికి చెందిన రాఘవేంద్ర, గోవిందమ్మల నుంచి 5.27 క్వింటాళ్ల సివిల్ సప్లయ్ బియ్యం, రవాణా చేసే వాహనాన్ని సీజ్ చేశారు.
- కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామం సమీపంలో పేదల బియ్యం అక్రమ రవాణా చేస్తున్న లారీని సీజ్ చేసి 135 బస్తాలు (54 క్వింటాళ్లు) బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. లారీ ఓనర్ ప్రేమ్ సీలోరియాతో పాటు మద్దిలేటిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు.
- పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో 52 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేసి అరుణాక్షి, రామకృష్ణలపై క్రిమినల్, 6ఏ కేసు నమోదు చేశారు.
- తుగ్గలి మండలం రాంపల్లి వద్ద పేదల బియ్యం అక్రమ రవాణా చేస్తున్న లారీ, ఓ కారును సీజ్ చేసి 1,100 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అనంతపురం జిల్లాకు చెందిన డి.శంకర్, శివప్రసాద్, తుగ్గలి మండం రాంపల్లికి చెందిన భాస్కరరెడ్డి, డోన్ మండలం చింతలపేటకు చెందిన వడ్డె సురేశ్‌లపై 6ఏ, క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కేసులో జేసీ కోర్టులో రూ.4 లక్షలు పెనాల్టీ వేసినట్లు తెలుస్తోంది.
- కల్లూరు చెన్నమ్మ సర్కిల్ వద్ద అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల పేదల బియ్యం స్వాధీనం చేసుకొని కె.మహేశ్, జయప్రకాశ్‌నాయుడు, ఇర్ఫాన్‌పై కేసులు నమోదు చేశారు.
- మంత్రాలయం మండలం మాధవరం చెక్‌పోస్టు వద్ద కర్ణాటకకు తరలిస్తున్న బియ్యం లారీని సీజ్ చేసి 80 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. చింతకుంట శ్రీకాంత్‌పై కేసు నమోదు చేశారు. అలాగే.. ఆస్పరిలో జోహారాపుం రోడ్డు వద్ద 14 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేశారు.
- ఆదోని పట్టణ దాణాపురం రోడ్డులో పేదల బియ్యం రవాణా చేస్తున్న వాహనం సీజ్ చేసి 3.20 క్వింటాళ్లు బియ్యం స్వాధీనం చేసుకున్నారు. షేక్ షబ్బీర్‌పై కేసు నమోదు చేశారు. మరో కేసులో 3.51 క్వింటాళ్ల బియ్యం, వాహనం సీజ్ చేసి అబ్దుల్ రహీమాన్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారని అధికారుల ద్వారా తెలిసింది.



పత్తికొండ ఎంఎల్‌ఎస్ పాయింట్ గోదాము

### రెండు వారాల్లో వేలం వేస్తాం



పేదల బియ్యం అక్రమ రవాణాను అడ్డుకొని 430 టన్నులు (4,300 క్వింటాళ్లు) వివిధ ఎంఎల్‌ఎస్ గోదాముల్లో నిల్వ చేశాం. 2024 జనవరి నుంచి పోయిన జనవరి వరకు 1,516 క్వింటాళ్లు సీజ్ చేశాం. 6ఏ కింద 21 కేసులు నమోదు చేశాం. అందులో ఏడు కేసుల్లో క్రిమినల్ కేసులు కూడా పెట్టాం. సీజ్ చేసిన బియ్యం రెండు వారాల్లోగా పబ్లిక్ ఆక్షన్ ద్వారా అమ్మకాలు చేస్తాం. రాయితీ బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెట్టాం. ఎక్కడైనా బియ్యం అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలిస్తే పక్కా సమాచారం ఇస్తే తక్షణమే దాడులు చేస్తాం.

- రఘువీర్, జిల్లా మేనేజరు, పౌర సరఫరాల శాఖ, కర్నూలు

## ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్

**కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి):** జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు బుధవారం జరిగాయి. ఈ పరీక్షలకు ఉదయం 66 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 3837 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా ఇందులో 3724 మంది హాజరయ్యారు. 113 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన ప్రాక్టికల్ పరీక్షలకు 66 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం విద్యార్థులు 3353 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో 3304 మంది పరీక్షకు హాజరు కాగా, 49 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఆర్ఐవో కన్వీనర్ గురువయ్య శెట్టి, డీవీఈవో పరమేశ్వరరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ జి. లాలెప్ప, డీఈసీ సభ్యులు నాగభూషణం రెడ్డి, పద్మావతి, స్క్వాడ్ సభ్యులు పర్యవేక్షించారు.

## విశ్రాంత కోర్టు ఉద్యోగి నుంచి రూ.53.54 లక్షలు స్వాహా

• కేసు నమోదు

**కర్నూలు క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కింగ్ మార్కెట్‌కు చెందిన హేమంతకుమారి అనే విశ్రాంత కోర్టు ఉద్యోగి నుంచి సైబర్ నేరస్థులు రూ.53.54 లక్షలు స్వాహా చేశారు. సీఐ రామయ్య నాయుడు వివరాల మేరకు.. హేమంత కుమారి కోర్టు ఉద్యోగి పదవీ విరమణ పొందారు. భర్త కొద్ది కాలం కిందటే మృతి చెందాడు. పిల్లలు కూడా లేరు. ఒంటరిగా నివాసం ఉంటోంది. ఈమె పదవీ విరమణ అనంతరం రూ.45 లక్షలు బెనిఫిట్స్ వచ్చాయి. వీటన్నింటిని ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో భద్రపరుచుకుంది. గత ఏడాది నవంబరులో ఓ అపరిచిత వ్యక్తి ఆమెకు కాల్ చేశారు. తాను ఎన్‌ఫోర్స్‌మెంటు ఎస్ఐనంటూ.. మీ మీద కేసులు ఉన్నాయి.. వారెంటు వచ్చిందంటూ బెదిరించారు. అరెస్టు చేయకుండా ఉండాలంటే పెద్దమొత్తంలో డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో ఆమె రూ.45 లక్షలను ఆ అపరిచితుడు సూచించిన అకౌంటుకు ఆర్‌టీజీఎస్ ద్వారా బదిలీ చేసింది. ఆ తర్వాత మరోసారి ఫోన్ చేసి బెదిరించడంతో రూ.8.5 లక్షలను బదిలీ చేసింది. తర్వాత తాను మోసపోయానని గుర్తించి బుధవారం పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. సంబంధిత నగదు బదిలీ చేసిన అకౌంట్లను పరిశీలిస్తే కలకత్తాకు చెందిన అకౌంట్లుగా గుర్తించారు.

## హామీలు అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మురళీకృష్ణ

**కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి):** ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డీసీసీ అధ్యక్షుడు పి. మురళీకృష్ణ అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 143 బీసీ కులాల్లో ఏ ఒక్క కులానికి న్యాయం జరగలేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలు బీసీలకు అమలు చేయాలని కోరారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఎప్పటి అమలు చేస్తారని ప్రశ్నించారు. జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ ఎస్‌సీ బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.

## ప్రయాణికుల భద్రతే ఆర్టీసీ లక్ష్యం


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

**కర్నూలు రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చడమే ఆర్టీసీ ముఖ్య ఉద్దేశమని కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పైడి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం కర్నూలు చౌరస్తా సమీపంలో ఉన్న ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలలో రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. డ్రైవర్లు జాగ్రత్తగా విధులు నిర్వహించి సకాలంలో ప్రయాణికులను గమ్యస్థానాలను చేర్చాలన్నారు. శివరాత్రి సందర్భంగా ముందస్తుగా షెడ్యూల్ తయారు చేసుకోవాలని ఆయన ఆర్ఎంను సూచించారు. కర్నూలు ఆర్టీవో భరత్‌చౌహాన్, ఆర్ఎం శ్రీనివాసులు, ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, ఎంవీఐ రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

## లారీని ఢీకొన్న కంటైనర్

• డ్రైవర్ మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

**పాణ్యం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని సుగాలిమెట్ట గ్రామ సమీపంలోని కొత్తచెరువు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. నంద్యాల వైపు నుంచి కర్నూలు వైపునకు వన్‌వేలో వెళ్తున్న టాటాఏసీని ఎదురుగా వస్తున్న కంటైనర్ అతి వేగంగా ఢీకొనడంతో బేతంచెర్ల మండలానికి చెందిన కుమ్మరి కేశాలు (53 ) అక్కడికక్కడే మృతి చెందారు, హైవేలో పని చేస్తున్న బీహార్‌కు చెందిన కార్మికుడు జితేంద్రకు తీవ్ర గాయాలు కావడంతో శాంతిరాం ఆసుపత్రికి తరలించినట్లు పాణ్యం పోలీసులు తెలిపారు. కంటైనర్ నుంచి ఎగిరిన టైరు పక్కన వెళ్తున్న కారుపై పడడంతో కారు దెబ్బతిన్నట్లు తెలిపారు. కారులోని ప్రయాణికులు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. మృతుడు హైవేలో పని చేసే కార్మికులను వాహనంలో తరలించేవాడన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


మృతి చెందిన డ్రైవర్ కేశాలు

## బావిలో పడి యువకుడి మృతి

**చాగలమర్రి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలో మల్లేవేముల బస్టాండు సమీపంలో నివాసం ఉంటున్న బాబు (33) అనే యువకుడు బుధవారం కూలూరు రహదారిలోని ఓ బావిలో పడి మృతి చెందాడు. బాబు అనే యువకుడు విద్యుత్‌శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో విద్యుత్ బిల్లులు వసూలు చేసే పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పోలీసులకు సమాచారం అందడంతో ఏఎస్ఐ నబీసాహేబ్, పోలీసులు మృతదేహాన్ని గజ ఈతగాళ్లతో బయటకు తీశారు. బావి సమీపంలో వాహనం, పాద రక్షలు బాబువిగా గుర్తించారు. మృతదేహాన్ని ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని మృతుడి కుటుంబీకులు కోరారు.


బాబు (ఫైల్)

## ఎస్సార్బీసీలో పడి నంద్యాల వాసి..

**బనగానపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** ఎస్సార్బీసీ కాల్వలో పడి నంద్యాలకు చెందిన షేక్ జాకీర్ బాషా(53) మృతి చెందినట్లు బనగానపల్లె ఎస్ఐ దుగ్గిరెడ్డి బుధవారం తెలిపారు. నంద్యాల పట్టణానికి చెందిన షేక్ జాకీర్‌బాషా సంజీవనగర్ గేటు సమీపంలో జ్యూస్ దుకాణం పెట్టుకొని వ్యాపారం జీవనం సాగిస్తున్నాడు. నంద్యాల నుంచి పాణ్యం గ్రామానికి పండ్లు కొనడానికి వెళ్లి ప్రమాదవశాత్తు పాణ్యం సమీపంలోని ఎస్సార్బీసీ పడి గల్లంతయ్యాడు. బనగానపల్లె పట్టణ శివారులోని బనగానపల్లె - కోవెలకుంట్ల రహదారిలోని ఎస్సార్బీసీ కాల్వ వద్ద శవమై తేలాడు. గురువారం ఉదయం ఎస్సార్బీసీలో కొట్టుకుపోతుండగా జాకీర్ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.


జాకీర్ బాషా (ఫైల్)

## రేషన్ బియ్యం పట్టివేత

**రుద్రవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** రుద్రవరంలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉన్నాయని సమాచారం అందడంతో బుధవారం దాడి చేసినట్లు ఎస్ఐ వర ప్రసాద్ తెలిపారు. ఈ దాడిలో 15.2 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. ముత్యాల హుసేనీ, హుసేన్‌వలి అనే వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

# కేజీబీవీలో విద్యార్థులకు అస్వస్థత


అస్వస్థతకు గురైన విద్యార్థులు


విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్లు

• రాత్రికి రాత్రే నంద్యాలకు తరలింపు

**బండిఆత్మకూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** కస్తూర్బా బాలికల పాఠశాలలో ఎనిమిది మంది విద్యార్థులు అస్వస్థతకు లోనయ్యారు. మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో నక్షత్ర, మహాలక్ష్మి, శ్రీచంద్రిక అనే ఆరో తరగతి విద్యార్థులు వాంతులు, కాళ్ళు చేతులు లాగటంతో అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఉపాధ్యాయులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ ప్రాథమిక వైద్య సేవలు అందించి అక్కడి సిబ్బంది నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. ఈ ఘటనకు ఒక రోజు ముందు పాఠశాలలోని మరో ఐదుగురు విద్యార్థులు ఇవే లక్షణాలతో బాధపడుతుండగా డాక్టర్లు ఆల్బెండోజల్ గుళికలు వేయలేదు. కస్తూర్బా పాఠశాలలో విద్యార్థుల అస్వస్థతకు విద్యార్థులు తీసుకున్న ఆహారం కారణమా? లేక ఒక రోజు ముందు వేసిన ఆల్బెండోజల్ గుళికలు కారణమా? తెలియాల్సి ఉంది.

● విద్యార్థుల అస్వస్థతకు కారణం ఆల్బెండజోల్ గుళికలు కాదని డాక్టర్లు భావన, సవిత అన్నారు. గుళికలు వేసిన 24 గంటల అనంతరం ఈ ఘటన చోటుచేసుకున్నదన్నారు. విద్యార్థులంతా క్షేమంగా ఉన్నారని, ఆందోళన అవసరం లేదని అన్నారు.

## 20న జడ్పీ స్థాయి సంఘాల సమావేశాలు

**కర్నూలు, న్యూసిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు ఈ నెల 20న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశభవనంలో ఏడు స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసారని ఆయన తెలిపారు. ఉదయం 10.30 గంటల నుండి 11.30 గంటల వరకు 2వ స్థాయి సంఘం, 11.30 నుండి 12.00 గంటల వరకు 3వ స్థాయి సంఘం, 12.30 గంటల నుండి 1.30 గంటల వరకు 6వ స్థాయి సంఘం, మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకు 4వస్థాయి సంఘం, 3.00 గంటల నుంచి 4.00 వరకు 5వ స్థాయి సంఘం, 4.00 నుంచి 6.00 వరకు 1, 7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఈఓ పేర్కొన్నారు.

## జేఈఈ మెయిన్స్‌లో 'నారాయణ' విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో నారాయణ కళాశాల డీజీఎం గోవర్ధన్ రెడ్డి

**కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** జేఈఈ-మెయిన్స్ మొదటి విడత పరీక్ష ఫలితాల్లో నారాయణ కళాశాల విద్యార్థులు విజయభేరి సృష్టించారని కళాశాల డీజీఎం గోవర్ధన్ రెడ్డి బుధవారం తెలిపారు. టి. మిథున్ సాయికుమార్ 99.91 పర్సంటైల్, కే. జీవన్ కుమార్ 99.85, కే.చరణ్ కుమార్ 99.84, ఎన్.శివ ధనుష్ 99.48, కే.సాయి శృతి 99.43, ఎండీ ఖాజా ఫయాజ్ అహ్మద్ 99.43, కే.సాయి భాస్కర్ 99.21, డి.ధరణి 99.09, ఎన్. హర్షిత 98.87 పర్సం టేజీ సాధించారని తెలిపారు. పలువురు 90 శాతానికి పైగా సాధించారని తెలిపారు. డీన్‌లు ఆంజనేయ రెడ్డి, విశ్వనాథరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ సారిక, విజయమోహన్, సుజాత ఉన్నారు.

## 'న్యూక్లియస్' విద్యార్థులు


విద్యార్థులతో కళాశాల డైరెక్టర్లు

**నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల న్యూక్లియస్ కళాశా ల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ మురళీధర్‌రెడ్డి తెలిపారు. కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కళాశాల కరస్పాండెంట్ మురళీధర్‌రెడ్డి, డైరక్టర్ వాసుదేవరెడ్డి, సలహాదారు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన అనీషాతబస్సుమ్ 99.37. లిఖిత్ 96.00. సాయికిరణ్‌రెడ్డి 94.00, కార్తీక 93.52, స్నేహలతారెడ్డి 93.31, మనోజ్ కుమార్ 92.69, పద్మమీనాక్షి 91.61 పర్సంటేజీ సాధించినట్లు వివరించారు.

## మహానందీశ్వరుడికి రూ.కోటి ఆదాయం


టెండర్లను పరిశీలిస్తున్న ఈవో శ్రీనివాస రెడ్డి

**మహానంది, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** మహానంది క్షేత్రంలో భక్తుల ఏర్పాట్లలో భాగంగా నిర్వహించిన వివిధ బహిరంగ వేలాల ద్వారా దేవస్థానానికి రూ.1 కోటి 33 వేల ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దేవస్థానం పరిధిలోని పోచా విశ్రాంతి భవనంలో బుధవారం జరిపిన వేలాల్లో టెండర్‌దారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సీల్ టెండర్ పక్రియ ద్వారా అధిక మొత్తం దాఖలు చేసిన టెండర్‌దారులకు భక్తులకు సౌకర్యాల ఏర్పాటుకు ఏడాది పాటు అనుమతి ఇచ్చినట్లు చెప్పారు. ఇందులో భక్తులకు పూజా సామగ్రి విక్రయించే హక్కుకు మహానందికి చెందిన పి. మురళీకృష్ణ రూ.60 లక్షల వందకు, నవగ్రహ మంటపం వద్ద దీపాలు వెలిగించే హక్కును మహానందికి చెందిన నాగరాజు రూ.43 లక్షలకు, భక్తుల సామాన్లు భద్ర పరిచే హక్కును నంద్యాలకు చెందిన నాగేంద్ర రూ.21 లక్షల 96 వేలకు, తలనీలాలు పోగుచేసుకునే హక్కును హిందూపురానికి చెందిన రూ.7 లక్షల 80 వేలకు దక్కించుకున్నట్లు చెప్పారు. అలాగే దేవస్థానానికి చెందిన పాత జనరేటర్‌ను రూ.41 వేల 500కు నంద్యాలకు చెందిన వ్యాపారి బహిరంగ వేలం ద్వారా దక్కించుకున్నట్లు ఈవో చెప్పారు. మిగతా వాటికి దేవస్థానంకు అనుకున్నంత ఆదాయం రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ఎర్రమల్ల మధు, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, సిబ్బంది నీలకంఠరాజు, మల్లికార్జునయ్య, నాగమల్లయ్య పాల్గొన్నారు.

## మోచేతి ధమనులతో గుండె ఆపరేషన్

• కర్నూలు జీజీహెచ్‌లో మొట్ట మొదటిసారి



చికిత్స చేయించుకున్న రోగి, ఇన్‌సెట్‌లో డా.ప్రభాకర్ రెడ్డి

**కర్నూలు హస్పిటల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గుండె ఊపిరితిత్తుల శస్త్ర చికిత్స విభాగంలో మొట్టమొదటిసారిగా ధమనులతో బైపాస్ సర్జరీని సిటీసర్జన్ డా.సి. ప్రభాకర్ రెడ్డి విజయవంతంగా నిర్వహించారు. ఐదు రోజులు క్రితం నగరానికి చెందిన ఆటోడ్రైవర్ రవి 120 కేజీలతో ఒబెసిటీతో బాధపడుతూ గుండె రక్తనాళాలు బ్లాక్ అయి సిటీ సర్జరీ విభాగానికి వచ్చారు. సర్జన్ డా.సి. ప్రభాకర్ రెడ్డి బుధవారం రోగికి ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఆపరేషన్ చేశారు.

## ఎన్‌సీడీ 3.0 సర్వే త్వరగా పూర్తి చేయండి

• జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ శైలేష్ కుమార్

**కర్నూలు హస్పిటల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్‌సీడీ 3.0 సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎన్‌సీడీ జిల్లా నోడల్ ఆఫీసర్ డా. శైలేష్ కుమార్ అన్నారు. బుధవారం కర్నూలు మెడికల్ కాలేజీ మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో కర్నూలు డివిజన్ పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యాధికారులకు ఎన్‌సీడీ 3.0 స్క్రీనింగ్‌పై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల పైబడిన వారందరికీ గ్రామీణ ప్రాంతాల్లో ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌వో, ఏఎన్ఎం, ఆశా, అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో స్టాఫ్ నర్సు, ఏఎన్ఎం, ఆశాలు కలిపిన బృందం ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారన్నారు. వారంలో ఐదు రోజులు (సోమవారం నుంచి శుక్రవారం) నోటి, రొమ్ము, సర్వేకల్ క్యాన్సర్లు, బీపీ, షుగర్, పరీక్షలు చేస్తారన్నారు. శిక్షణలో డెమో శ్రీనివాసులు శెట్టి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి, ఫ్లోరాసిస్ కన్సల్టెంట్ సుధాకర్, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

## అద్దె వాహనాలకు అనుమతి

**కర్నూలు హస్పిటల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం కింద డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్, ఆర్‌బీఎస్‌కేలకు రెండు వాహనాలను అద్దెకు తీసుకోవడానికి నేషనల్ హెల్త్ మిషన్ మంగళగిరి నుంచి అనుమతుతి జారీ అయిన ట్లు డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 16వ తేదీలోపు డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్‌బీఎస్‌కే లేదా సర్వీసు ఇంజనీర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని సెల్ నెంబర్లు 9966786760, 9030900884 ను సంప్రదించాలన్నారు.


## అంతర్ రాష్ట్ర దొంగలు పరారీ

**మహానంది, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** మహానంది పరిసరాల్లో ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలు పోలీసుల కళ్ళుగప్పి పరారయ్యారు. నంద్యాల వన్‌టౌన్ పరిసరాల్లో కనిపించిన ఈ దొంగలను పోలీసులు సీసీ కెమెరాల ద్వారా మంగళవారం రాత్రి గుర్తించినట్లు సమా చారం. వీరు మహానంది వైపు మోటర్‌బైక్‌పై వెళ్లినట్లు గుర్తించారు. దాదాపు 20 మంది స్పెషల్ పార్టీ పోలీసుల బృందం అర్ధరాత్రి మహానందికి చేరుకొని ప్రైవేట్ లాడ్జీలతో పాటు దేవస్థానం వసతి గృహాలు, టూరిజం వసతి గదుల్లో సోదాలు నిర్వహించినా దొంగల అచూకీ కన్పించలేదు. క్షేత్ర ప్రధాన రాతి నంది సర్కిల్ నుంచి అయ్యన్న నగర్ సమీపంలోని శాలివాహన సత్రం వైపు వెళ్లి, చీకట్లో దారి లేక పోవడంతో బైక్‌ను అక్కడే వదిలి పంట పొలాల వైపు దొంగలు పరారయ్యారు. బుధవారం ఉదయం డ్రోన్ కెమెరా ద్వారా పారిపోయిన దొంగల కోసం ప్రయత్నించినా ఆచూకీ లభించలేదు.

## విజిలెన్స్ తనిఖీలు

**కర్నూలు క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** నగరంలోని పార్కు రోడ్డులోని షరాఫ్ బేకరిలో విజిలెన్స్ అధికా రులు తనిఖీలు చేశారు. బేకరిలో ఉన్న ఉస్మానియా బిస్కెట్లు, మసాలా వేరుశనగ పప్పును సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ఆహార భద్రతా నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో సుమారు రూ.20వేల జరిమానా విధించారు. గృహ వినియోగ సిలిండర్లు వాడుతున్నట్లు గుర్తించి మూడు సిలిండర్లు సీజ్ చేశారు. వీటిని పౌరస రఫరాల శాఖ అధికారులకు అప్పగించారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


ఐవీ సుబ్బారావును సన్మానిస్తున్న నాయకులు

• ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు

**కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి):** వర్కింగ్ జర్నలిస్టులందరికీ పక్కా ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీయూ భవన్‌లో, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఈఎన్ రాజు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ విస్తృతస్థాయి సమావేశానికి ఐవీ సుబ్బారావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత జగన్ ప్రభుత్వం జర్నలిస్టుల ఇళ్ల పథకం కింద 60:40 శాతం ఇళ్ల స్థలాల కొనుగోలు నిధులు ఇస్తామని చెప్పినా ఒక్క ఎకరం భూమి కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక, ఇటీవల దీనిపై ఒక కమిటీ వేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభల నాటికి ప్రభుత్వం తమ డిమాండ్లను మంజూరు చేయకపోతే ఆందోళన కార్యాచరణ తయారు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ జాతీయ సభ్యులు, కే. నాగరాజు, గోరంట్ల కొండప్ప, జిల్లా ఏపీయూడబ్ల్యూజే గౌరవ సలహాదారులు సుబ్బయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈఎన్ రాజు, శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సుంకన్న, సీనియర్ జర్నలిస్టు హరికిషన్ తదితరులు మాట్లాడారు. అనంతరం ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షునిగా రెండో పర్యాయం ఏకగ్రీవంగా ఎన్నికైన ఐవీ సుబ్బారావును జర్నలిస్టులు ఘనంగా సత్కరించారు. అలాగే రాష్ట్ర సమితి సభ్యులుగా ఎన్నికైన దేవేంద్ర, భీమన్న, మధులను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి అంజి, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు శివ, స్వరూప్, నూర్, గిరి, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పత్తికొండ అధ్యక్షులు శ్రీనివాసులు, పరమేష్, జయరాజ్, సాలు రంగడు పాల్గొన్నారు.

• **ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కన్వీనర్‌గా హరికిషన్ :** ఈ కార్యక్రమంలో జిల్లా ఎల క్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల అసోసియేషన్ అడహక్ కమిటీ కన్వీనర్‌గా సీనియర్ జర్నలిస్టు హరికిషన్‌ను రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు ప్రకటించారు. సభ్యులుగా సీనియర్ జర్నలిస్టులు మధు, సుంకన్న, శివలను ఎన్నుకున్నారు.

• **దివంగత సురేంద్రబాబు (చిన్న)కు నివాళి :** ఇటీవల గుండెపోటుతో హఠాన్మరణం చెందిన ఏబీఎన్ స్టాఫ్ కెమెరామెన్ జె. సురేంద్రబాబు (చిన్న), విశాలాంధ్ర రిపోర్టర్ హనుమంతన్నలకు నివాళి ప్రకటించారు. సురేంద్రబాబు కుటుంబసభ్యులను కలిసి ఐవీ సుబ్బారావు కలిసి పరామర్శించారు.

## జేఈఈ మెయిన్స్‌లో 'రావూస్' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపాల్ అప్పారావు

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నంద్యాల రావూస్ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల చైర్మన్ ఏఎంవీ అప్పారావు తెలిపారు. కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అప్పారావు మాట్లాడుతూ బి.పూర్ణేష్‌రావు 98.05, సహర్ష 97.75, శ్రావ్య 96.41, సభా 95.06, హుస్సేన్ 93.02, గురునాథరెడ్డి 89.53 పర్సంటైల్ సాధించినట్లు తెలిపారు. మంచి ఫలితాల సాధనకు కృషిచేసిన అధ్యాపకులను అభినందించారు.

## 'బీమాతో కుటుంబానికి ధీమా'

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క కూలీ కచ్చితంగా బీమా చేసుకోవాలని, దీనివల్ల కుటుంబానికి ధీమా ఉంటుందని లేబర్ ఆఫీసర్ బషీరున్నీషా బేగమ్ సూచించారు. బండిఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో దస్తగిరి అధ్యక్షతన బుధవారం ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పనులకు హాజరయ్యే కూలీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తెలిపిన మేరకు విధిగా బీమా చేసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీవో వసుధ, టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## డ్రైనేజీ పనులు ప్రారంభం

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 37 వార్డు నందమూరి నగర్‌లో బుధవారం డ్రైనేజీ పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ నందమూరి నగర్‌లో రూ. 1.50 కోట్ల విలువైన రోడ్లు, డ్రైనేజీ పనులుకు శంకుస్థాపన చేశారు. మంత్రి ఆదేశాల మేరకు పనులు స్థానిక వార్డు ఇన్‌చార్జి మామిడి నాగరాజు, మామిడి ఉషారాణితో పాటు 38వ వార్డు ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు మాట్లాడుతూ త్వరలో పనులను పూర్తి చేసి మంత్రితో ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు.

## 'జయప్రదం చేయాలి'



పోస్టరును విడుదల చేస్తున్న నాయకులు

నంద్యాల నూనెపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకల సందర్భంగా చలో సేవాగడ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ బాలునాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్వామినాయక్ పిలుపునిచ్చారు. బుధవారం నంద్యాలలో చలో సేవాగడ్ పోస్టరును విడుదల చేశారు. అనంతపురం జిల్లా గుత్తి సమీపంలోని సేవాగడ్‌లో వెలసిన బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి ఉత్సవాలను ఈ నెల 13, 14, 15 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శ్రీశైలం స్వామినాయక్, రమేష్‌నాయక్, తిరుపాలునాయక్, మునినాయక్, తిప్పానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్న సేవలో రాధా మనోహర్ దాస్

శ్రీశైలం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను బుధవారం హిదూ ధర్మప్రచారకులు రాధా మనోహర్ దాస్ దర్శించుకుని ప్రతేక పూజలు నిర్వహిచుకున్నారు. పూజల అనంతరం అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేద ఆశీర్వచణం, తీర్థ, ప్రసాదాలు అదించారు.

## 'పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం'

వెలుగోడు ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని మండల అధికారులు, తహశీల్దార్, శ్రీనివాసగౌడ్, ఎంపీడీవో మధసూదన్‌రెడ్డి, ఏపీవో మల్లికార్జున సూచించారు. వెలుగోడులోని సచివాలయం 5 ఆవరణలో పల్లెవనం కార్యక్రమంలో బాగంగా మొక్కలు నాటారు. టీడీపీ నాయకులు అన్నా రపు శేషిరెడ్డి, మాజీ సర్పంచ్ కలాం, సర్పంచ్ జయపాల్, జాకీర్ హుస్సేన్, అమీర్‌హంజా, అటవీశాఖ, ఉపాది సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## 'మహిళలు రాజకీయాల్లో రాణించాలి'

నందికొట్కూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మహిళలు రాజకీయాంగా రాణించాలని లెక్చరర్ సునీత అన్నారు. పట్టణంలోని వాల్మీకి నగర్‌లో అఖిలభారత ప్రగతిశీల మహిళా సంఘం 32వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు లక్ష్మీదేవి, ఎస్.బీబీ జెండాను ఆవిష్కరించారు.

## అక్రమ వెంచర్లపై దాడులు



అక్రమ వెంచర్లలో రాళ్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నందికొట్కూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పుట్ట గొడుగుల్లా అక్రమంగా వెలుస్తున్న వెంచర్లపై మున్సిపల్ అధికారులు దాడులు చేశారు. బుధవారం పట్టణంలోని నాగలూటి రోడ్డు, నంద్యాల రోడ్డులో ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటైన వెంచర్లపై మున్సిపల్ అధికారులు దాడులు చేశారు. ఈ వెంచర్లలో పాతిన రాళ్లను తొలగించారు. మున్సిపల్ అధికారుల అనుమతులు లేకుండా వెంచర్లు వేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమీషనర్ బేబి రియల్టర్లను హెచ్చరించారు.

## 'బకాయిలు చెల్లించాలి'

ఆత్మకూరు రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఆత్మకూరు తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు కల్లూరి మస్తానయ్య, ఈడిగ వెంకటరమణ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఆసంఘం కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. కుటుంబ అవసరాల కోసం దాచుకున్న డబ్బులు, జీతంతో పాటు రావాల్సిన డీఏలు, కరువు భత్యం, సరెండర్ లీవులు, పీఆర్సీ బకాయిలు, పదవీ విరమణ తర్వాత వచ్చే బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీనివాసులు, గుర్రప్ప,జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

# చెరువు నీటి సమస్య పరిష్కారానికి కృషి: ఆర్డీవో



సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో నాగజ్యోతి

మిడుతూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మద్దిగుండం చెరువు నీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి చెప్పారు. బుధవారం మిడుతూరు ఎంపీడీవో కార్యాలయంలో జలకనూరు మద్దిగుండం చెరువు కింద సాగు చేస్తున్న సుంకేసుల, జలకనూరు గ్రామాల రైతులతో తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్డీవో నాగజ్యోతి, ఇరిగేషన్ ఈఈ రఘురామి రెడ్డి, విద్యుత్ ఈఈ జయశంకర్, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు ఇరు గ్రామాల రైతులతో వేర్వేరుగా చర్చలు జరిపారు. మొదట జలకనూరు గ్రామ రైతులు మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన మద్దిగుండం చెరువు నీటికి సుంకేసుల గ్రామ రైతులు అక్రమంగా మోటార్లు ఏర్పాటు చేసి నీటిని వాడుకుంటున్నారని చెప్పారు. దీనివల్ల చెరువు నీరు తగ్గిపోయి తమ పొలాలకు నీరు అందక తీవ్రంగా నష్టపోతున్నామని చెప్పారు. గతంలో అధికారుల సమావేశంలో సుంకేసుల గ్రామ రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు మాత్రమే నీటిని వాడుకోవాలని అధికారులు సూచించారని గుర్తుచేశారు. అయితే సుంకేసుల గ్రామ రైతులు రబీలో సాగు చేసిన పంటలకు కూడా నీటిని వాడు కోవడం వల్ల చెరువులో నీరు లేక జలకనూరు గ్రామ రైతులు పంటపొలాలకు లకు నీరు అందక తీవ్రంగా నష్టం వాటిల్లిందని అన్నారు. సుంకేసుల గ్రామ రైతులు మాట్లాడుతూ పదిహేనేళ్ల నుంచి చెరువు నీటిని మోటార్ల ద్వారా వాడుకుంటున్నామని, ప్రస్తుతం నీరు ఇవ్వకుంటే తీవ్రంగా నష్టపోతామని చెప్పారు. ఆర్డీవో మాట్లాడుతూ ఇరుగ్రామాల రైతులు తమ సమస్యలు అర్జీల రూపంలో ఇవ్వాలని సూచించారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరకుండా డీఎస్పీ రామాంజి నాయక్, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంపీడీవో దశరథరామయ్య, ఇరిగేషన్ ఏఈఈ వేదనారాయణ, ఏడీఈ శ్రీనివాసులు, ఏఈ క్రాంతికుమార్, వ్యవసాయాధికారి పీరునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏపీఈఈయూ జూబ్లీ వేడుకలు



జెండా ఎగురవేస్తున్న నాయకులు

పాణ్యం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా యూనియన్ నాయకులు ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు. బుధవారం పాణ్యం విద్యుత్ కార్యాలయం వద్ద యూనియన్ జెండా ఆవిష్కరించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 1104 ఈసీ మెంబరు గోపాల్, లైన్‌మన్ ఈశ్వరయ్య, వెంకట్రాముడు, జేఎల్ఎం షరీఫ్, ఏఎల్ఎం శ్రీనివాసులు, చంద్రశేఖర్‌నాయుడు, మద్దిలేటి, రాంగయ్య పాల్గొన్నారు.

## 'మైదానంలోకి ఉదయం 7 గంటల వరకే అనుమతి'

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నంద్యాల బొమ్మలసత్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలోకి ఉదయం 7గంటల వరకు మాత్రమే ఉంటుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శశికళ తెలిపారు. కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డైరెక్టర్ ఆఫ్ కాలేజి ఎడ్యుకేషన్ ఇచ్చినటువంటి ఉత్తర్వుల ప్రకారం కళశాల మైదానంలోకి ఉదయం 4గంటల నుంచి 7గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందని, ఆ తర్వాత ప్రైవేట్ వ్యక్తులు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకూడదని తెలిపారు. క్రీడామైదానంలోకి అనుమతి లేకుండా రాకూడదని చెప్పారు. పట్టణ ప్రజలు గమనించి తమకు సహకరించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## 'బీజేపీతోనే దేశాభివృద్ధి'



వైసీపీ కార్యకర్తలను బీజేపీలోకి ఆహ్వానిస్తున్న అభిరుచి మధు

గోస్పాడు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): దేశం, రాష్ట్రాభివృద్ధి ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీతోనే సాధ్యమని నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు పేర్కొన్నారు. బుధవారం గోస్పాడు మండలం ఎం.క్రిష్ణాపురం గ్రామంలో వైసీపీ కార్యకర్తలు భారీగా నంద్యాల జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు సమక్షంలో పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన శివరామిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, వడ్లపెద్దఆచారి, శంకర్‌రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు బీజేపీలో చేరారు. జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు గ్రామానికి చేరుకోవడంతో పూలతో ఘన స్వాగతం పలికారు. గ్రామంలో మహిళలు ఆయన వద్దకు వెళ్లి తమ సమస్యలు తన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం గ్రామంలో ఏర్పాటుచేసిన సభలో పార్టీలో చేరిన వారికి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. గోస్పాడు మండల అధ్యక్షుడు మధుగోపాల్, చల్లా మధు, కొశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 'జయప్రదం చేయండి'

ఆత్మకూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 14 నుంచి 20వ తేది వరకు జరిగే నిరసనలను జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు రణధీర్, రామ్‌నాయక్, వీరన్న పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆర్థిక వ్యవస్థలో తగ్గిన డిమాండ్ సమస్యను పరిష్కరించేందుకు అందుకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లుఁ తెలిపారు. నిరుద్యోగులను ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించినట్లు తెలిపారు. ఆహార సబ్సిడీలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమంపై గత ఏడాది కేటాయించిన నిధుల కంటే తక్కువగా కేటాయించినట్లు తెలిపారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ఈనెల 14 నుంచి 20వ తేది వరకు జరగనున్న నిరసనలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## 'రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారం'

గడివేముల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలు రీసర్వేతో పరిష్కారమవుతాయని తహసీల్దార్ వెంకటరమణ అన్నారు. మండలంలోని కొరపోలూరు గ్రామంలో రీసర్వేను బుధవారం ఆయన తనిఖీ చేశారు. రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. రీసర్వే డీటీ హరికృష్ణ, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## 'ఎండు తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలి'

పాములపాడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కందిపంటలో సోకే ఎండు తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలని ఏవఫణీశ్వరరెడ్డి, నంద్యాల జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయశాఖ అధికారి హేమలత సూచించారు. వేంపెంటలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## 'మహిళలు నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి'

పాణ్యం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మహిళలు నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలని శాంతిరాం హాస్పిటల్ మానసిక వైద్య విభాగం అసిస్టెంటు ప్రొఫెసర్ డాక్టర్ సింధూజ ఓంకారం సూచించారు. ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో 'భావోద్వేగ బుద్ధి - మీ కలలను నిజం చేసుకోవడం' అనే అంశంపై విద్యార్థినులకు, మహిళా అధ్యాపకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జెఎన్‌టీయూఏ మహిళా సాధికారత సెల్ డైరెక్టర్ డాక్టర్ వీబీ చిత్ర, కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, మహిళా సాధికారత సెల్ కోఆర్డినేటర్ హరిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డిప్యూటీ ఈవోకు సత్కారం



డిప్యూటీ ఈవోను సత్కరిస్తున్న ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నంద్యాల డిప్యూటీ ఈవోగా నియమితులైన శంకర్‌ప్రసాద్‌ను ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు సత్కరించి అభినందించారు. అసోసియేషన్ నాయకులు దండె దస్తగిరి, పడకండ్ల సుబ్రమణ్యం, బాలచంద్రుడు, పాండే, బత్తినవెంకటేశ్వర్లు డిప్యూటీ ఈవోను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ప్రైవేట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించి తమకు సహకరించాలని కోరారు.

## 'ఒప్పందాలను అమలు చేయాలి'

ఆత్మకూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు సమ్మెకాలంలో ఇచ్చిన ఒప్పందాలను అమలు చేయాలని సీఐటీయు నాయకులు రామ్‌నాయక్, రణధీర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ నాయకులు పెద్దనాగరాజు, తిమ్మయ్య, గొడుపు రాజు, సువర్ణమ్మ పేర్కొన్నారు. బుధవారం ఆత్మకూరు మున్సిపల్ కార్యా లయం ఎదుట చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారానికి రెండో రోజుకు చేరుకున్నాయి. ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమిస్కిల్డ్ వేతనాలు, హెల్త్, రిస్క్ అలవెన్స్‌లను ఇవ్వాలన్నారు. నాయకులు మాబాషా, వెంకటేశ్వర్లు, వినోద్‌కుమార్, సతీష్, రమేష్, జాన్సన్‌రాజు ఉన్నారు.

## 'ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి'

కొత్తపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఎంపీడీవో మేరీ సూచించారు. బుధవారం కొత్తపల్లిలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఐఎఫ్‌సీ క్లస్టర్ కన్వర్జెన్సీ సమావేశం ఏపీఎం పుల్లయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఎంపీడీవో, సీఆర్‌పీల విధులు, బాధ్యతలపై సభ్యులకు వివరించారు. అలాగే డీపీఎం సురేష్ మాట్లాడుతూ ఐఎఫ్‌సీ క్లస్టర్ల గురించి వివరించారు. ఏవో మహేష్ మాట్లాడుతూ ఉద్యాన పంటల్లో ఎక్కువ ఆదాయంతో పాటు రాయితీ కూడా ఉంటుందన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ శ్రీనివాసులు మాట్లాడుతూ హార్టికల్చర్ ద్వారా పంటలు సాగు చేసిన రైతులకు వంద శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. ఏపీఎం పుల్లయ్య మాట్లాడుతూ ఐఎఫ్‌సీ క్లస్టరులో ఒక జీవనోపాధి నుంచి పది రకాల జీవనోపాదులను ప్రతి కుటుంబం కలిగి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి భువనేశ్వరి, ఉద్యానవన అధికారి చందన, ఎంఎంఎస్ సభ్యులు మహిళా రైతులు పాల్గొన్నారు.

# అమ్మవార్లకు బోనాల సమర్పణ



నంద్యాలలో జంబులా పరమేశ్వరి అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు



ఆత్మకూరు సమీపంలో..

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణ వాయువ్య దిశన వెలసిన జంబులాపరమేశ్వరీదేవి ఆలయంలో బుధవారం మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా బోనాల పండుగ, తిరునాళ్ల అత్యంత వైభవంగా నిర్వహించారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గాండ్ల రాజేశ్వరి, గాండ్ల జగన్‌మోహన్, భక్తులు పాల్గొన్నారు. హౌసింగ్‌బోర్డు కాలనీలో వెలసిన అమ్మస్ఫటికలింగేశ్వర ఆల యంలో పౌర్ణమి సందర్భంగా లలితాదేవి జయంతి వేడుకలను యోగానంద ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉమామహేశ్వర ఆశ్రమంలో మాఘపూర్ణిమ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతులు ప్రణవానందగిరి గురుస్వాములచే ఉదయం లలితాసహస్రనామ పారాయణం, కుంకు మార్చన, లలితాయజ్ఞం నిర్వహించారు. అన్నప్రసాద వితరణ గావించారు.

**ఆత్మకూరు:** ఆత్మకూరు పట్టణ శివార్లలోని జంబులాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో బుధవారం బోనాల సమర్పణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అలాగే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సరస్వతీ, నాగదేవతామూర్తులతో పాటు ఊసిరిచెట్టుకు భక్తులు పూజలు నిర్వహించారు. భక్తులతో పాటు శివస్వాములకు ప్రత్యేక అన్నదానం ఏర్పాటు చేశారు. శ్రీనారాయణ విద్యావిహార్ పాఠశాల విద్యార్థులు ఉత్సవంలో సేవలందించారు.

● జంబులా పరమేశ్వరీ అమ్మవారికి ఆత్మకూరు రిటైర్డు ఎంఈవో జానకిరామ్, విజయలక్ష్మీ దంపతులు రూ.50 వేల విలువ గల వెండి ఆభరణాలను వితరణకు అందజేశారు. ప్రత్యేకించి వెండితో తయారు చేసిన హారము, వడ్డాణం చెవికమ్మల బంగారు కోటింగ్ వేయించి ఆలయ నిర్వాహకులు వెన్నా శ్రీధర్‌రెడ్డికి అందజేశారు. ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించడం సంతోషకరమన్నారు.

**నందికొట్కూరు:** భారతాల పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో భక్తులు పూజలను ఘనంగా నిర్వహించారు. బుధవారం భారతాల పౌర్ణమి సందర్భంగా భక్తులు అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన తదితరాది కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణానికి చెందిన భాస్కర్ శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారి వాహనమైన సింహానికి పంచలోహపు తొడుగును తయారు చేయించి మేళతాళాలపై ఊరేగింపుగా తీసుకొని వచ్చి బహూకరించారు.

**కొత్తపల్లి:** మండల కేంద్రమైన కొత్తపల్లి గ్రామ శివారులోని జంబులా పరమేశ్వరి దేవి అమ్మవారి సన్నిధానంలో భార్తాల పౌర్ణమి వేడుకలు అశేష భక్తజనం వద్ద ఘనంగా జరిగాయి. జంబులమ్మ దేవాలయ నిర్మాణ దాత దివంగత పడిగెలయ్య వారసుల్లో ఒకరైన పల్లా నాగరాజు ఆధ్వర్యంలో విచ్చేసిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

## యువతకు అవగాహన

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నంద్యాల శ్రీ రామకృష్ణా డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఇంటర్ డిస్ట్రిక్ట్ యూత్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చిన యువతకు స్ఫూర్తిదాయక విలువలపై అవగాహన కల్పించారు. డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ సుద్దాల ఎంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీ రామకృష్ణా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, యుగేందర్, వైఎన్ విష్ణువర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ మంచి పనులు ఎప్పటికీ గుర్తుంటాయని, యువత మంచి వైపు పయనించాలన్నారు.

● శ్రీ రామకృష్ణా డిగ్రీ కళాశాలలో కళాశాల అధ్యాపకులు ఇంతియాజ్, వెంకట్రావు సారథ్యంలో జాతీయ ఉత్పాదక దినోత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి హాజరై మాట్లాడుతూ ఈనెల 12వతేదీ నుంచి 18వ తేదీ వరకు జాతీయ ఉత్పాదక వారోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, మానవ తప్పిదాలను తగ్గించడానికి సాంకేతికత అత్యంత ప్రభావితమైనదని అన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగుల రక్తదానం



రక్తదానం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నంద్యాల ఆర్టీసీ డిపోలో బుధవారం 45 మంది ఆర్టీసి ఉద్యోగులు రక్తదానం చేశారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో డీపీటీవో రజియా సుల్తానా, డిపో మేనేజర్ ఎ.సుధాకర్ రావు, నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు లింగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## 'ఏటీఎస్‌ల అభివృద్ధికి కృషి చేయాలి'



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ల (ఏటీఎస్) అభివృద్ధికి కృషి చేయాలని అసోసియేషన్ నాయకులు కోరారు. బుధవారం జిల్లా ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ అసోసియేషన్ నాయకులు అమరావతిలో ఏపీ రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఏటీఎస్ రంగానికి అవసరమైన మద్దతును అందించాలని అసోసియేషన్ నాయకులు మంత్రిని కోరారు. ఇప్పటివరకు ఏటీఎస్‌ల అభివృద్ధికి మంత్రి చేస్తున్న సేవలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఏపీలో ఏటీఎస్‌ల ప్రాధాన్యత, అభివృద్ధి, మౌలిక సదుపాయాలపై చర్చించినట్లు నాయకులు తెలిపారు.

## 'నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి'



మంత్రి రామానాయుడును సన్మానిస్తున్న సంజీవకుమార్ రెడ్డి

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలుగు గంగ ప్రాజెక్టులో భాగమైన వెలుగోడు రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని ఆ ప్రాజెక్టు చైర్మన్ సంజీవ కుమార్ రెడ్డి ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడును కోరారు. ప్రాజెక్టు చైర్మన్ బుధవారం అమరావతిలో ఇరిగేషన్ మంత్రిని కలిశారు. తెలుగు గంగ లైనింగ్ పనులు పూర్తి చేయటంతో పాటు జంగిల్ క్లియరెన్స్ చేయాలని మంత్రిని కోరానన్నారు. తెలుగు గంగ ఆయకట్టును పెంచటానికి ప్రస్తుతం ఉన్న రిజర్వాయర్ నిల్వ సామర్థ్యాన్ని 10 టీఎంసీల నుంచి పూర్తి సామర్థ్యం 16 టీఎంసీలకు పెంచాలని కోరానన్నారు. రిజర్వాయర్ నిల్వ సామర్థ్యం పెంచటం వల్ల వేలాది ఎకరాల తెలుగ గంగ ఆయకట్టు పెరిగి తన అభ్యర్థనలకు మంత్రి సానుకూలంగా స్పందించారని అధికారులతో చర్చించి పనులు చేపడతామని హామీ ఇచ్చారన్నారు. తెలుగు గంగ ప్రాజెక్టును సందర్శించటానికి మంత్రి నిమ్మలనాయుడిని నంద్యాలకు ఆహ్వానించినట్లు సంజీవ కుమార్ రెడ్డి తెలిపారు.

## భ్రమరాంబ దేవికి లక్ష కుంకుమార్చన

శ్రీశైలం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో బుధవారం పౌర్ణమిని ఘడియలను పురస్కరించుకొని సాయంత్రం భ్రమరాంబాదేవి అమ్మవారికి లక్ష కుంకుమార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా అర్చకస్వాములు పూజా సంకల్పం పఠించి అనంతరం మహాగణపతికి పూజలు చేశారు. తరువాత శాస్త్రోక్తంగా లక్షకుంకుమార్చనను జరిపించారు. భక్తులు వారి గోత్రనామాలతో లక్షకుంకుమార్చనలో పాల్గొనేందుకు దేవస్థానం పరోక్ష సేవ ద్వారా అవకాశం కల్పించింది. శ్రీశైలక్షేత్రానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు వారి గోత్రనామాలతో ఆయా ఆర్జితసేవలలో పాల్గొనేందుకు ఆన్‌లైన్ ద్వారా రూ. 1,116 సేవారుసుమును చెల్లించి పరోక్షసేవలో పాల్గొనవచ్చును. కాగా వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు మొత్తం 41 మంది భక్తులు ఈ సేవలో పాల్గొన్నారు. భక్తులు ఈ పరోక్షసేవ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావు కోరారు.

## ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఆత్మకూరు రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలోని నల్లకాల్వ గ్రామంలో వెలసిన గాయత్రీమాత ఆలయ 20వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో భాగంగా ఆలయ పురోహితుల ఆధ్వర్యంలో ఉదయం గణపతిపూజ, నవ గ్రహ పూజల అనంతరం శ్రీగాయత్రిమాత అమ్మవారికి పంచామృతాభిషేకాలతో అభిషేకించారు. వేదపండితుల పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా వేదమాతకు ప్రత్యేక అలంకరణ గావించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ప్రత్యేకంగా అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి ఇక్కడ జరిగే విశేషపూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

## శివుడికి ప్రత్యేక పూజలు

పాములపాడు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మాఘమాసం మాఘ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని శివస్వాములు మహాశివుడికి అన్నాభిషేకం నిర్వహించారు. మండలంలోని క్రిష్ణారావుపేట గ్రామంలోని శివాలయంలో బుధవారం శివలింగానికి ప్రత్యేక పూజలు చేసి అన్నంతో అభిషేకించి హారతులు ఇచ్చి అఖండ శివనామ భజన కార్యక్రమం నిర్వహించారు. పురోహితులు పవన్‌స్వామి, గురుస్వామి రామకృష్ణ ఆధ్వర్యంలో రుద్రహోమం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు.

**గడివేముల:** మండల కేంద్రంలోని శివాలయంలో శివస్వాములు స్వామికి బుధవారం పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

## షిరిడీ సాయిబాబా మందిరంలో చండీ హోమాలు

● పూజల్లో పాల్గొన్న ధర్మవరం సుబ్బారెడ్డి దంపతులు



హోమంలో పాల్గొన్న ధర్మవరం సుబ్బారెడ్డి దంపతులు

**డోన్ రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** పట్టణ సమీపంలోని షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా బుధవారం షిరిడీ సాయిబాబా మందిరం ప్రాంగణంలో చండీ హోమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. చండీ హోమంలో రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి దంపతులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం షిరిడీ సాయిబాబా మందిరం కమిటి సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

## బండలాగుడు పోటీలు ప్రారంభం



బండలాగుడు పోటీని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

**బేతంచెర్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) :** మండల పరిధిలోని రెహిమాన్‌పురం గ్రామంలో కాశీ విశాలాక్షి విశ్వేశ్వర స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా గ్రామస్థులు బుధవారం బండలాగుడు పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ హాజరయ్యారు. ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బండలాగుడు పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, బుగ్గన మాధవిరెడ్డి, గౌడు, భరత్, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా రంగనాథ స్వామి తిరుణాల

**డోన్ రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఉంగరానిగుండ్ల గ్రామంలో ఘనంగా రంగనాథ స్వామి తిరుణాల మహోత్సవాలు జరిగాయి. రంగనాథ స్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా స్థాయి బండలాగుడు పోటీలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ పెద్దలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

**డోన్ రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అందజేశారు. డోన్ పట్టణం వైఎస్‌నగర్‌కు చెందిన దాసరి రవి గుండె జబ్బుతో బాధపడుతుండగా.. హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ద్వారా సీఎం సహాయ నిధి కింద రూ.3.50లక్షల చెక్కును బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అందజేశారు.

## భారీగా నాటుసారా బెల్లం పట్టివేత

**డోన్ రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** డోన్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ పరిధిలోని హుశేనాపురం గ్రామంలో ఎక్సైజ్ పోలీసులు భారీగా నాటుసారాకు ఉపయోగించే బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం డోన్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాముడు వివరాలు వెల్లడించారు. గ్రామంలో గుండ్ల మల్లికార్జున అనే వ్యక్తి భారీగా నాటుసారా బెల్లం డంప్ చేస్తున్నాడనే సమాచారంతో దాడులు నిర్వహించి 55 సంచుల 1125 కేజీల బెల్లాన్ని గుర్తించి సీజ్ చేశామన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. దాడులో డోన్ ఎక్సైజ్‌స్టేషన్ సీఐ వరలక్ష్మి, ఎస్ఐలు సోమశేఖర్, దౌలత్‌ఖాన్, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

## అన్నాభిషేకం అలంకరణలో ఈశ్వరుడు

**చాగలమర్రి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** చాగలమర్రి గ్రామంలోని పాత శివాలయంలో దీక్ష చేపట్టిన శివస్వాములు బుధవారం పౌర్ణమి సందర్భంగా ఈశ్వరస్వామిని అన్నాభిషేక అలంకారంలో కొలువుదీర్చారు. శివస్వాములు ఈశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరణ చేసి పూజలు చేశారు. శివపార్వతులకు సామూహికంగా భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో శివస్వాములు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దు

**కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) :** విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురి కాకూడదని తహసీల్దారు బాలీశ్వరరెడ్డి, ఎంపీడీవో ప్రసాదరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని పెట్నీకోట జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలను విద్యాధికారి అబ్దుల్‌కలాంతో కలిసి పదవతరగతి ప్రీ ఫైనల్ పరీక్షలను తనిఖీ చేశారు. అనంతరం సైన్స్ ల్యాబ్‌లో విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. పదవతరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుధాకరగుప్త, ఉపాధ్యాయులు రమణయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అంకితభావంతో పని చేసినప్పుడు గుర్తింపు

**కోవెలకుంట్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) :** ప్రతి ఉద్యోగి విధుల పట్ల అంకితభావంతో పని చేసినప్పుడు మంచి గుర్తింపు వస్తుందని కోవెలకుంట్ల ఏడీఈ సతీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఏఈ రామ్మోహన్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ సతీష్‌కుమార్‌రెడ్డితో పాటు విద్యుత్ శాఖ సిబ్బంది ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఏఈలు మధు, పక్కీరయ్య, అసిస్టెంటు ఏవో వెంకటేశ్వర్‌రెడ్డి, సబ్ ఇంజనీరు శ్రీనివాసులు, లైన్‌మెన్, సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీ నాయకుడి సతీమణి మృతికి సంతాపం

**సంజామల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** మండలంలో టీడీపీ సీనియర్ నాయకులు మంచాల తులసిరెడ్డి సతీమణి మంచాల రామలక్ష్మమ్మ(60) మృతి బాధాకరమని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ తెలిపారు. బుధవారం రామిరెడ్డిపల్లె గ్రామానికి చేరుకొని ఆమె పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సురేశ్‌రెడ్డి, మంచాల మద్దిలేటిరెడ్డి, సర్పంచ్ వీరప్రతాప్ రెడ్డి, శంకర్‌రెడ్డి, చిన్నశేఖర్‌రెడ్డి, నాగిరెడ్డి, ఏళ్ల శ్రీనివాసులు, శీలావెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీల సంఖ్య పెంచండి: పీడీ

**కోవెలకుంట్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) :** పని అడిగిన ప్రతి కూలీకి ఉపాధి పని కల్పించాలని డ్వామా పీడీ వెంకట సుబ్బయ్య ఆదేశించారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలోని ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఏపీవో శ్రీవిద్య ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధికూలీల సంఖ్య పెంచాలన్నారు. విధుల పట్ల అంకిభావంతో పని చేయాలని నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. అనంతరం బీమునిపాడు గ్రామంలో మొక్కలను పరిశీలించారు. ఎంపీడీవో వర ప్రసాదరావు, ఈసీ హరికిశోర్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



భీమునిపాడులో మొక్కలను పరిశీలిస్తున్న పీడీ వెంకటసుబ్బయ్య

# అందని ఆయుష్మాన్ సేవలు

- వైద్యులు లేరు, సిబ్బంది లేరు ..
- ఐదేళ్లుగా మూతబడిన కేంద్రం

**కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** మండలకేంద్రమైన ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆయుష్మాన్ సేవలు ఆరేళ్లుగా నిలిచిపోయాయి. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు ఎంతగానో ఉపయోగపడే ఆయుర్వేదిక్ వైద్య సేవలు అందకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ విభాగానికి సంబంధించి కొలిమిగుండ్ల పీహెచ్‌సీలో ప్రత్యేక వైద్యుడుతో పాటు, సిబ్బంది ఉండేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం ఆయుర్వేదిక్ వైద్య సిబ్బందికి జీతాలు చెల్లించుకుండా నిలిపివేయడంతో పాటు, మందులను కూడా సరఫరా చేయలేదు. దీంతో ఆయుర్వేదిక్ విభాగం పూర్తిగా మూతబడింది. దుష్ఫలితాలులేని ఆయుర్వేద వైద్యం పట్ల ప్రజలు మొగ్గుచూపుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ వైద్యశాలను మూసివేయడం తగదని పలువురు వాపోతున్నారు. దీర్ఘకాలిక రోగులను ఆదుకునే ఆయుర్వేదిక్ విభాగాన్ని తిరిగి పునరుద్ధరించాలని రోగులు, మండల ప్రజలు కోరుతున్నారు.

**కూటమి ప్రభుత్వం కరుణ చూపేనా..**

కాగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయుర్వేదిక్ వైద్యశాలపై కరుణ చూపుతుందన్న ఆశాభావాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆయుర్వేదిక్ వైద్యశాలలను ప్రోత్సహించిన చరిత్ర సీఎం చంద్రబాబుదేనని పలువురు గుర్తుచేసుకుంటున్నారు. తిరిగి వాటిని పునరుద్ధరిస్తే రోగులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. త్వరితగతిన ఆయుర్వేదిక్ వైద్యశాలను అందుబాటులోకి తీసుకరావాలని ప్రజలు కోరుతున్నారు.




ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం

# రైతుల సంక్షేమమే లక్ష్యం

**డోన్ రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** రైతుల సంక్షేమమే లక్ష్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గుమ్మకొండ, వెంకటాపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆ గ్రామంలోని రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు చెరువుల ద్వారా సాగునీరు అందించడమే లక్ష్యమన్నారు. సాగునీటి సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో హెచ్‌డీఎస్ సర్వసభ్య సమావేశానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి హాజరయ్యారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ హనీఫ్‌తో పాటు ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి శాలువతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ ఆసుపత్రిలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు.



గుమ్మకొండలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కోట్ల

# ఆళ్లగడ్డ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి



**ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) :** ఆళ్లగడ్డ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు తోడ్పాటునందించాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ కోరారు. బుధవారం కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, భార్గవ్‌రామ్ దంపతులు ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. కర్నూలు ఎయిర్‌పోర్టును మరింతగా అభివృద్ధి చేయాలని ఆయనను కోరారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు సహకరిస్తామని, నిధులు కూడా మంజూరు చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే అఖిలప్రియ తెలిపారు.

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఎమ్మెల్యే దంపతులు

## కొత్తగా మూడు స్కూల్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు

**రుద్రవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) :** మండల పరిధిలోని రుద్రవరం, యల్లావత్తుల, నరసాపురం గ్రామాల్లో కొత్తగా మూడు స్కూల్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేసినట్లు ఎంఈవో-2 లక్ష్మి బుధవారం తెలిపారు. ప్రతినెలా మూడో శనివారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఉంటాయన్నారు. సమావేశానికి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు హాజరు కావాలన్నారు. పాఠశాలలో 11.45కు విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. ప్రభుత్వం మధ్యాహ్నం నుంచి అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించిందన్నారు. కాంపెక్స్ సమావేశాలకు హాజరుకావాలన్నారు.

## ఇంటి స్థలాలు ఇచ్చి ఆదుకోండి

**డోన్ రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని కేఈ కృష్ణమూర్తినగర్ వాసులు కోరారు. బుధవారం డిప్యూటీ తహసీల్దార్ సునీల్‌కు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాధవస్వామి, ఎరుకుల లక్ష్మీదేవి, బోయ మధు, వడ్డె బాలరాజు, వడ్డె మద్దిలేటి, రిక్షా రంగన్న, నాగేశ్వరరావులు మాట్లాడుతూ వెంకటాపురం గ్రామ ప్రధాన రోడ్డులో పేరంటాలమ్మ గుడి ప్రాంతంలో పేదలకు స్థలాలు ఇచ్చి తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం



బీసీ రాజారెడ్డిని ఆహ్వానిస్తున్న ఈవో చంద్రుడు, సిబ్బంది

**బనగానపల్లె, ఫిబ్రవరి 12 ( ఆంధ్రజ్యోతి):** యాగంటి శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దామని మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని బీసీ రాజారెడ్డి కార్యాలయంలో బీసీ రాజారెడ్డిని యాగంటి ఆలయ ఈవో చంద్రుడు, మౌళీశ్వరరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా బీసీ రాజారెడ్డి ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉత్సవాలను నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో జోలాపురం తిరుమలయ్య, అర్చకులు ఉన్నారు.

## దరఖాస్తు గడువు పొడిగింపు

**కోవెలకుంట్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) :** బీసీ రుణాల కోసం దరఖాస్తు గడువు పొడిగించినట్లు కోవెలకుంట్ల ఎంపీడీవో వర ప్రసాదరావు తెలిపారు. బుధవారం ఎంపీడీవో మాట్లాడుతూ బీసీ రుణాల కోసం దరఖాస్తు గడువు ఈ నెల 12 వరకు ఉండేదన్నారు. అయితే ప్రభుత్వం మరో మూడు రోజులు ఈ నెల 15 వరకు పెంచిందన్నారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి

**కోవెలకుంట్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) :** ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించాలని తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి సూచించారు. బుధవారం తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలు, వీఎస్‌ఏలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంటు పుల్లయ్య, వీఆర్వోలు సిబ్బంది పాల్గొన్నారు.

## మాలల యుద్ధ గర్జనను జయప్రదం చేయండి

**కోవెలకుంట్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) :** కర్నూలు జిల్లాలో ఈ నెల 23న నిర్వహించనున్న రాయలసీమ మాలల యుద్ధ గర్జనను సభను జయప్రదం చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బరాయుడు కోరారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం యుద్ధ గర్జన సభ కర పత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు కోగిల రంగమ్మ, వెంకటేశ్వర్లు, శేఖర్, జయన్న, తిరుపాలు పాల్గొన్నారు.

## నేటి నుంచి టెక్కె స్వామి ఉరుసు

**అవుకు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని కునుకుంట్ల గ్రామ సమీపంలో వెలసిన టెక్కెస్వామి దర్గాలో గురువారం నుంచి మూడు రోజులపాటు ఉరుసు జరుగనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు ఇస్మాయిల్‌బేగ్, హసన్‌బేగ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్‌బేగ్ మాట్లాడుతూ కునుకుంట్ల గ్రామ టీడీపీ నాయకులు గూడాల శివరామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉరుసు నిర్వహిస్తున్నామని అన్నారు. 13న గంధం, 14న ఉరుసు, 15న జియారత్ కార్యక్రమాలు జరుగుతామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చే అవకాశం ఉండటంతో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## భూ సమస్య పరిష్కారం

- హర్షం వ్యక్తం చేసిన రైతులు



తహసీల్దారు భారతిని సన్మానిస్తున్న రైతులు

**ప్యాపిలి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** టీడీపీ ప్రభుత్వం అమలు పరిచిన రెవెన్యు సదస్సుల ద్వారా 16 ఏళ్ల భూసమస్య పరిష్కారం కావడంతో బుధవారం రైతులు తహసీల్దారు భారతిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని ఏనుగమర్రి గ్రామంలో రైతు దూదేకుల బాషా అదే గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు నుంచి 2009లో మూడు ఎకరాల భూమి కొనుగోలు చేశారు. అయితే మూడు ఎకరాల్లో అర ఎకరా ప్రభుత్వ భూమి కొలిచి ఇచ్చాడు. ఈ విషయం ఏడాది తర్వాత బయటపడింది. అప్పటి నుంచి భూమి కొనుగోలు చేసిన దూదేకుల బాషా అధికారుల చుట్టూ తిరిగినా ఎవరు పట్టించుకోలేదు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో బాధితుడు అర్జీ ఇవ్వగా క్షుణ్ణంగా పరిశీలించిన అధికారుల భూమి విక్రయించిన శ్రీనివాసులతో మాట్లాడి తన ఆదీనంలో ఉన్న పట్టా భూమిని దూదేకుల బాషాకు ఇప్పించారు. దీంతో బాధితుడు బాషా, గ్రామానికి చెందిన టీడీపీ నాయ కులు మోపూరి రామక్రిష్ణ, అరిగెల శంకర్, సూర్యనారాయణగౌడు, మ హేంద్ర, రైతులు రెవెన్యూ అధికారులను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా మాఘ పౌర్ణిమ పూజలు

**కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని ప్రముఖ ఆలయాల్లో మాఘ పౌర్ణిమ పూజలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కొండపై వెలసిన కాళభైరవ స్వామి ఆలయం, బెలుం సిద్ధ రామేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, అంకిరెడ్డిపల్లె, కనకాద్రిపల్లె, మీ ర్జాపురం తదితర గ్రామాల్లో మాఘ పౌర్ణిమ పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

**ఘనంగా వాసవీ మాతాకు పూజలు**

**బేతంచెర్ల:** మాఘ పౌర్ణమి వేడుకలు పురస్కరించుకుని బుధవారం పట్టణంలో వెలసిన వాసవి కన్యకా పరమేశ్వరి దేవికి ఆర్యవైశ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, నిర్వహించారు. అమ్మవారిశాలలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గుండా గోపాల్, మండల అధ్యక్ష కార్యదర్శులు జనార్దన్, సుధీర్, వాసవీ సంఘం క్లబ్ అధ్యక్షుడు గుంతా వెంకటరమణ గుప్తా, ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా పల్లకి సేవ, సహస్ర దీపాలంకరణ



సహస్ర దీపాలంకరణ సేవలో చౌడేశ్వరీమాత

**బనగానపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని నందవరం చౌడేశ్వరి మాత ఆలయంలో బుధవారం మాఘ పౌర్ణమిని ఉద్దేశించి సహస్ర దీపాలంకరణ, పల్లకి సేవ, ఊయల సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో కామేశ్వరమ్మ, పీ.వీ. కుమార్‌రెడ్డి, సిబ్బంది ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు ఊయలసేవ, సహస్ర దీపాలంకరణ కార్యక్రమాల్లో పాల్గొని నందవరం శ్రీ చౌడేశ్వరి మాతను దర్శించుకుని ప్రత్యేక మొక్కు లు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ శిక్షణ

**బనగానపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ లలిత, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్‌లో డొమెస్టిక్ డాటా, ఎంట్రీఆపరేటర్, అసిస్టెంట్ టెక్నీషియన్ కంప్యూటర్, హార్డ్వర్ కోర్సులకు మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పదోతరగతి, ఆపైన చదివిన విద్యార్థులు 18 నుంచి 26 సంవత్సరాల వయస్సుగల వారు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. వివరాలను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌ను గాని, లేదా 9705998056 నంబర్‌ను సంప్రదించాలని వారు కోరారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

## కలప అక్రమ రవాణా నిర్మూలనకు చర్యలు

- రామకృష్ణ, ఎఫ్‌వో, అటవీశాఖ



**చాగలమర్రి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** కలప అక్రమ రవాణా నిర్మూలనకు ప్రత్యేక నిఘా ఉంచామని అటవీశాఖ ఎఫ్‌వో రామకృష్ణ అన్నారు.

అటవీ ఉత్పత్తులపై ఆధారపడే ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి అడవులు పచ్చగా ఉంటే మనుగడకు ఎంతో ఉపయోగమన్నారు. బుధవారం ఆంధ్రజ్యోతితో ఎఫ్‌వో మాట్లాడారు.

**ప్రశ్న:** డి.వనిపెంట రేంజి పరిధిలో కలప అక్రమ రవాణా అరికట్టేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

**జవాబు:** డి.వనిపెంట రేంజి పరిధిలోని అటవీ ప్రాంతంలో కలప అక్రమంగా తరలించకుండా ప్రత్యేక నిఘా పెట్టాం. ఎప్పటికప్పుడు ఆకస్మికంగా దాడులు నిర్వహిస్తున్నాం.

**ప్రశ్న:** అడవుల్లో మంటలు చెలరేగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

**జవాబు:** గ్రామాల్లో అటవీ ఉత్పత్తులపై ఆధారపడే ప్రజలకు ప్రతి ఏటా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. అడవులు పచ్చగా ఉంటే మనుగడకు ఎంతో ఉపయోగమని చెబుతున్నాం.

**ప్రశ్న:** రేంజి పరిధిలో నర్సరీలు ఏర్పాటు చేస్తున్నారా?

**జవాబు:** ప్రస్తుతం డి.వనిపెంట రేంజి పరిధిలో నర్సరీలు ఏర్పాటు చేయలేదని, రుద్రవరం రేంజి పరిధిలో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నామని అన్నారు.

**ప్రశ్న:** అటవీ సిబ్బంది కొరత ఉందా?

**జవాబు:** అటవీ సిబ్బంది కొరత ఉంది. రెండు ఏబీవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎఫ్‌బీవోలు, గార్డులు, ప్రొటెక్షన్‌వాచర్లచే విధులు నిర్వహిస్తున్నాం.

**ప్రశ్న:** టేకు ప్లాంటేషన్ పనులు చేపట్టారా?

**జవాబు:** ప్రస్తుతం టేకు ప్లాంటేషన్ పనులు కొత్తగా చేపట్టలేదు. మినీ పర్కొలేషన్ ట్యాంకులు, అగ్నిమాపక నిరోధానికి లైనింగ్ పనులు చేపడుతున్నాం. కొత్తగా ఈ ఏడాది ప్లాంటేషన్ పనులు చేయడానికి ప్రతిపాదనలు తయారు చేశాం.

## 2,500 క్యూసెక్కులతో నీటి ప్రవాహం



రాజోలి ఆనకట్టపై పొంగి ప్రవహిస్తున్న నీరు

**చాగలమర్రి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద ఎగువ నుంచి వచ్చిన నీరు బుధవారం పొంగి ప్రవహిస్తోంది. ఆనకట్ట వద్ద 2,500 క్యూసెక్కుల నీరు కుందూలో ప్రవహిస్తోంది. కేసీ ప్రధాన కాలువకు 400 క్యూసెక్కుల నీరు విడుదల చేశామని ఏఈ జమాల్‌వలి తెలిపారు. ఆనకట్ట వద్ద గురపు డెక్కలను తొలగించేందుకు గేట్లను మూసి వేశామని, దీంతో నీటి ప్రవాహం పెరిగిందని అన్నారు. ఆనకట్ట నుంచి మైదుకూరు ప్రాంతానికి చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు కాలువకు నీటి ప్రవాహాన్ని పెంచామని అన్నారు. రైతులు నీటిని వృథా చేయకుండా వినియోగించుకోవాలని అన్నారు.

## రైతు రిజిస్ట్రీ ఆధారంగానే సంక్షేమ పథకాలు

- వ్యవసాయ డివిజన్ అధికారి సుధాకర్

**ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి):** రైతు నమోదు సంఖ్య అధారంగానే రైతులకు సంక్షేమ పథకాలు వర్తిస్తాయని కోవెలకుంట్ల డివిజన్ వ్యవసాయ అధికారి సుధాకర్ తెలిపారు. బుధవారం మండలంలోని పడిగెపాడు, హరివరం, నర్సిపల్లెలో జిల్లా శిక్షణాధికారి చెన్నయ్యతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లో 55 వేల మంది రైతులు ఉన్నారన్నారు. ఇప్పటి వరకు మూడు వేల మంది రైతులకు రిజిస్ట్రీ చేశామన్నారు. ఫిబ్రవరి చివరి నాటికి పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఏవో చంద్రశేఖరరెడ్డి, వీఏఏలు ప్రసాద్, షరీఫ, ఎంపీఈవో పనీష్, రైతులు ఉన్నారు.

**కొలిమిగుండ్ల :** మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పక చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి నాగరాజు అన్నారు. బుధవారం కొలిమిగుండ్ల రైతు భరోసా కేంద్రంలో వీఏఏ సుబ్రహ్మణ్యం ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేపట్టారు. వీఏఏలు సందీప్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ఫీల్డ్ అసిస్టెంటుపై విచారణ

**రుద్రవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని బీరవోలు గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంటు శ్రావణి బదులుగా తండ్రి బాలాంజనేయులు పని చేస్తున్నాడని ఫిర్యాదులు అందాయని ఏపీడీ సాంబశివరావు అన్నారు. బుధవారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధి కూలీలను , ఫిర్యాదుదారులను విచారించినట్లు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని ఏపీడీ తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో ప్రతాప్ తదితరులున్నారు.

## స్వచ్ఛ దివస్ అందరి బాధ్యత

**చాగలమర్రి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** గ్రామాల్లో స్వచ్ఛ దివస్-స్వచ్ఛంధ్ర అందరి బాధ్యతని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులచే సమావేశం నిర్వహించారు. ప్రతినెల మూడవ శనివారం స్వచ్ఛదివాస్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగ్గయ్య పాల్గొన్నారు.

## భూ ఆధార్‌తో కార్పొరేట్‌కు పంట

- ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు

**రుద్రవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) :** భూ ఆధార్‌తో కార్పొరేట్‌కు పంట, కౌలు రైతులకు తీరని వేదన మిగులుతుందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రైతుల పొలం పాస్‌బుక్, 1బీ అడంగల్, ఆధార్ కార్డు, సెల్ నెంబరు వ్యవసాయాధికారులకు ఇచ్చి 11 నెంబర్లతో కూడిన విశిష్ట సంఖ్యను రైతులకు ఇచ్చేందుకు ప్రభుత్వాలు పూనుకున్నాయన్నారు. కేవలం కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేందుకు ఇలా చేస్తున్నారన్నారు.

## 15న మండల స్థాయి క్యారంబోర్డు టోర్నమెంట్

**చాగలమర్రి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** చాగలమర్రి గ్రామంలోని కట్టమీదిస్వామి దర్గా వద్ద మండలస్థాయి క్యారంబోర్డ్ టోర్నమెంట్‌ను ఈ నెల 15న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సర్ఫరాజ్, గఫార్, రియాజ్ తెలిపారు. విజేతలకు దాతలు స్వర్ణకారుల సంఘ అధ్యక్షుడు దాదాపీర్, ఇంతియాజ్, ఇమామ్‌హుసేన్ సహకారంతో నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు 14న తమ పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

## జేఈఈ-మెయిన్స్ ఫలితాల్లో విద్యార్థి ప్రతిభ



అజిత్ రెడ్డి

**డోన్ టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):** జేఈఈ-మెయిన్స్ ఫలితాల్లో డోన్ పట్టణం నెహ్రూ నగర్‌కు చెందిన లక్కిరెడ్డి అజిత్ రెడ్డి ప్రతిభ కనబర్చడంతో తల్లిదండ్రులు అడ్వకేట్ హనుమంతరెడ్డి, రాజ్యలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాదు మాదాపూర్‌లోని నారాయణ కాలేజీలో ఇంటర్ చదువుతున్నారు. తమ బాబు 99 పర్సంటైల్ సాధించం ఆనందంగా ఉందన్నారు. మంచిమార్కులు సాధించేందుకు కృషి చేసిన అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.